జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



MAM (మెంబర్‌షిప్ అడ్వకేట్స్ మీడియా) సహకారంతో బహుజన రాజ్యాధికారం సాధిద్దాం

శివ భాగ్య రావు బహుజన IRS-VRS నేషనల్ కన్వీనర్

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి



సంపుటి 15 సంచిక 125 విశాఖపట్నం | బుధవారం 11 జనవరి 2023 | 8 పేజీలు | వెల : 5.00


# జగనన్న తోడు పథకం నిధులు విడుదల

## 3.95 లక్షల మంది ఖాతాల్లోకి రూ.395 కోట్ల కొత్త రుణాలు

అమరావతి: ఏపీలోని వైఎస్ జగన్ ప్రభుత్వం చిరు వ్యాపారులకు గుడ్ న్యూస్ చెప్పింది. నడ్డి విరిచే వడ్డీలకు చెల్లుచీటీ చెబుతూ చిరు వ్యాపారులకు అండగా ఉండాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ జగనన్న తోడు పథకాన్ని అందు బాటులోకి తీసుకువచ్చారు. దీనిలో భాగంగా బుధవారం సీఎం జగన్ కొత్త రుణాలను అందించనున్నారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్లు కొత్త రుణాలు అందించనున్నారు. దీంతోపాటు గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కడం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ



చేయనున్నారు.గ్రామాలు, పట్టణాల్లో సుమారు 5 అడగులు పొడవు, 5 అడుగులు వెడల్పు స్థలంలో శాశ్వత లేక తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకున్న వారు ఈ పథకానికి అర్హులు. అలాగే ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో తోపుడు బండ్ల మీద వస్తువులు, కూరగాయలు, పండ్లు అమ్ముకుని జీవించేవారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, గంపలు, బుట్టలలో వస్తువులు అమ్మేవారు, సైకిల్, మోటారు సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసేవారితో పాటు, సంప్రదాయ చేతివృత్తుల కళాకారులు.. ఇత్తడి పని చేసేవాళ్లు, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక, కొండపల్లి బమ్మల తయారీ, లేస్ వర్క్స్, కలంకారీ, తోలుబొమ్మలు, కుమ్మరి తదితర వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారు ఈ పథకానికి అర్హులని అధికారులు తెలిపారు.

**జగనన్న తోడు పథకం..**

పాదయాత్రలో ఈ చిరు వ్యాపారుల కష్టాలను చూసిన ముఖ్యమంత్రి వైయస్.జగన్ ఆ పరిస్థితులను మారుస్తూ, నిత్య కష్టంపైనే ఆధారపడి, గౌరవంగా జీవిస్తున్న వారిని ఆదుకోవడం కోసం, సున్నా వడ్డీకే రుణాలు అందిస్తూ జగనన్న తోడు పథకం అమలు చేస్తున్నారు.

**దేశంలోనే అత్యధిక రుణాలు..**

దేశంలో అత్యధికంగా వడ్డీలేని రుణాలు అందిస్తున్న ప్రభుత్వంగా ఏపీ సర్కార్ నిలిచింది. 11-01-2023) అందిస్తున్న రూ.395 కోట్ల రుణంతో కలిపి ఇప్పటివరకు రూ.15,31,347 మంది చిరు వ్యాపారాలు చేసుకునే లబ్ధిదారుల కు అందించిన వడ్డీలేని రుణాలు రూ.2,406 కోట్లుగా అధికారులు తెలిపారు. వీరిలో సకాలంలో రుణాలు చెల్లించి రెండోసారి రుణం కోరి పొందిన వారు 8,74,745 మంది అని వివరించారు.

# పల్లెల్లో మొదలైన సంక్రాంతి సందడి..

## కత్తి కట్టి కాక్ ఫైట్ సై అంటున్న పందేరాయుళ్లు.. ఎంతటివారైనా లెక్కచేయమంటూ పోలీసులు వార్నింగ్



పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పట్టణ వాసులకు స్వాగతం చెప్పడానికి పల్లెలు రెడీ అయ్యాయి.. మరోవైపు నిగనిగలాడే పందెం కోళ్లు పౌరుషంతో సవాలు చేస్తున్నాయి. పది రోజుల ముందే కోడిపందేలు, గుండాట, పేకాట జోరుగా సాగుతోంది. ఒకవైపు పోలీసులు వార్నింగ్ ఇస్తున్నా పందేలకు బరులు రెడీ చేస్తున్నారు నిర్వాహకులు. నిషేధం, కఠినచర్యలు, జైలు శిక్షలు.. వంటి మాటలు ఎన్ని వినిపించినా ప్రజల్లో తరాలుగా నాటుకుపోయిన సంస్కృతిని కట్టడి చేయడం కానిపని అంటూ నిరూపిస్తున్నారు పందెంరాయుళ్లు. బరులు సిద్ధమయ్యాయి. సంక్రాంతి కాక్ ఫైట్‌కు సై అంటూ పందెంకోళ్లు కాలు దువ్వుతున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో కోడి పందేల సందడి జోరుమీదుంది. కత్తి గట్టిన పందెంకోళ్లు..యుద్ధానికి సిద్ధమంటున్నాయి. సమరోత్సాహంతో కదం తొక్కుతున్నాయి.ఐతే ఒకవైపు బరులు సిద్ధమవుతుంటే..మరోవైపు కోడి పందాలపై ఉక్కుపాదం మోపుతున్నారు పోలీసులు. నిర్వాహకులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. పందేలకు స్థలాలు, తోటలు లీజుకిచ్చేవారికి కూడా ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. రూల్స్ బ్రేక్ చేసి బరులకు స్థలాలిస్తే క్రిమినల్ కేసులు పెడతామని వార్నింగ్ ఇస్తున్నారు. అంతేకాదు. పలు ప్రాంతాల్లో పందాలకు సిద్ధమవుతున్న బరులను ధ్వంసం చేస్తున్నారు. ఆకివీడు, భీమవరం, అడవి నెక్కలంలో బరులను..ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు.మరోవైపు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత మూడేళ్లలో 4వేల కేసులు నమోదయ్యాయి. 7వేల మందిని అరెస్ట్ చేశారు. ఐతే ఈ ఏడాది మాత్రం ఇప్పటికే 15 వందల మందిపై బైండోవర్ కేసులు ఫైల్ చేశారు. భారీగా కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఐనా సరే తగ్గేదే లేదంటున్నారు నిర్వాహకులు. కోడి పందాలపై ఆంక్షలున్నా.. ఆదేశాలున్నా బరులు గీసేశారు. కాళ్లకి కత్తిగట్టి కోళ్లను రెడీ చేశారు.సంక్రాంతి పండగ దగ్గర పడుతుండటంతో శ్రీకాకుళం జిల్లా కోడి పందాలు, పేకాట శిబిరాలు ఊపందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. తాజాగా కంచిలి మండలం అంపూరం జాతీయ రహదారి సమీపంలో కోళ్ల పందాలపై దాడి చేశారు పోలిసులు. రహస్య సమాచారం మేరకు మెరుపు దాడి చేసిన పోలీసులు పందెం రాయుల్లను అదుపులోకి తీసుకున్నారు.17 మందిని అరెస్ట్ చేశారు.7 కోడి పుంజులు,21వేల రూపాయిలు నగదు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు గోదావరి జిల్లాల్లో అప్పుడే కోడిపందేల జోరు మొదలైపోయింది. ఇష్టారాజ్యంగా పందెం బరులను రెడీ చేస్తున్నారు జూదంరాయుళ్లు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో పందెం బరులపై టీవీ9 కథనాలు ప్రసారం చేయడంతో కోరంగి పోలీసులు యాక్షన్ తీసుకున్నారు. టెంట్‌లు, భారీ సరంజామాను తొలగించారు. అలాగే బరులను ట్రాక్టర్లతో దున్నించారు. సంక్రాంతికి ముగ్గుల పోటీలు కోకో, కబడ్డీ, వాలీబాల్, షటిల్‌లాంటి గేమ్స్ ఆడుకోవాలని సూచించారు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసులు. అలా కాకుండా ఎవరైనా కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఒకవైపు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా, కోడిపందేలు, గుండాట, పేకాట మాత్రం జోరుగా సాగుతోంది. సంక్రాంతి కోసం ఇప్పట్నుంచే బరులు రెడీ చేస్తున్నారు నిర్వాహకులు. మరి, పోలీసుల హెచ్చరికలు హెచ్చరికలుగానే మిగిలిపోతాయా? లేక నిజంగానే కంట్రోల్ చేయగలుగుతారా? చూడాలి మరి



## ఆస్తుల పంపిణీపై ఏపీ ప్రభుత్వం పిటిషన్ విచారణ వాయిదా

ఢిల్లీ: రాష్ట్ర విభజన తర్వాత ఆస్తుల పంపిణీపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు తెలంగాణ, కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు హాజరుకాలేదు. ఇరువురికి నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఆరువారాలు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన సరిగా జరగకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే.

# పార్స్ సభ్యత్వం తీసుకున్న అఖిల్ గ్రూప్స్ అధినేత...





విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి ):బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు దూసుకెళ్తున్న పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) సభ్యత్వాన్ని విజయవాడ అఖిల్ గ్రూప్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ .కందుల.అఖిల్ యాదవ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్. కటికల.శివబాగ్యరావు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారమే ఏకైక లక్ష్యంగా పార్స్ త్వరలో రాజకీయపార్టీ గా ఆవిరభవించబోతున్నట్లు తెలిపారు. పది లక్షల సంతకాలు సేకరించి ఏప్రిల్ లో పార్టీ ప్రకటన చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో పార్స్ ఎపి స్టేట్ కోఆర్డినేటర్ నమ్మిన .అప్పారావు, కోశాధికారి గురజాల.శ్రీనివాసరావు,బంటు. మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సంతకాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్న ప్రొఫెసర్ కాశీమ్...**

హైదరాబాద్ లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమం లో ప్రొఫెసర్ కాశీమ్ పాల్గొన్నారు. బహుజన రాజ్యం కాక్షించే ప్రతీ ఒక్కరు పార్స్ సభ్యత్వం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బహుజనులు పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలు చేశారు.

## కేంద్ర-రాష్ట్రాల మధ్య ఘర్షణలో కేంద్రం వైపు నిలవండి.. సివిల్స్ సర్వీస్ అస్పిరెంట్స్‌కు గవర్నర్ రవి ఉద్బోధ

తమిళనాడు: తమిళనాడుపై అక్కడి అసెంబ్లీలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన గవర్నర్ ఆర్ఎన్ రవి.. మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్రం-రాష్ట్రాల మధ్య ఘర్షణ సందర్భాల్లో కేంద్రం వైపు సివిల్ సర్వెంట్లు నిలబడాలని పిలుపునిస్తూ.. ఆలిండియా స్థాయి అత్యున్నత అధికారులను బీజేపీ వైపు తిరిగేందుకు ప్రయత్నం చేశారు. గవర్నర్ రవి వ్యాఖ్యల పట్ల పలువురు ఉన్నతాధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించడంతో గవర్నర్ ఆర్ఎన్ రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగం కాకుండా గవర్నర్ ఏం మాట్లాడినా సభ రికార్డుల నుంచి తొలగించాలని తీర్మానంలో పేర్కొన్నారు. అంతకుముందు రాష్ట్రానికి తమిళనాడు అని కాకుండా తమిళ్‌గం అని పేరు పెడితే బాగుంటుందని గవర్నర్ రవి అసెంబ్లీలో అన్నారు. దీనిపై అధికార డీఎంకే, మిత్రపక్షం కాంగ్రెస్, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) సభ్యులు వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.ఇలాఉండగా, తమిళనాడు ప్రభుత్వంతో ఘర్షణ నేపథ్యంలో గవర్నర్ రవి మంగళవారం సివిల్ సర్వీసెస్ ఆస్పిరెంట్స్‌తో మాట్లాడుతూ.. 'కేంద్రం-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏదైనా అభిప్రాయ భేదాలు తలెత్తినప్పుడు ఎటువంటి సందేహం లేకుండా కేంద్ర ప్రభుత్వం వైపు నిలబడాలి' అని వారికి సూచించారు. ఇలా సివిల్ సర్వీసెస్ ఆస్పిరెంట్స్‌కు చెప్పడం ముమ్మాటికీ వారిని కేంద్రంలోని బీజేపీకి మద్దతుదారులుగా ఉండాలనడమే అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అఖిల భారత స్థాయి అధికారుల మధ్య అంతరాలు తీసుకొచ్చేలా గవర్నర్ స్థాయి వ్యక్తి మాట్లాడటం విచారకరమని పలువురు ఉన్నతాధికారులు చెప్తున్నారు.

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు.. 40 విమానాలు ఆలస్యం



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. పొగమంచు కారణంగా విమానాలు, రైళ్లు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నార్త్ ఇండియా వ్యాప్తంగా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వాహనదారులైతే చాలా కష్టంగా డ్రైవ్ చేయాల్సి వస్తుంది.ఢిల్లీ ఖాట్మండు, ఢిల్లీ - జైపూర్, ఢిల్లీ - సిమ్లా, ఢిల్లీ - డెహ్రాడూన్, ఢిల్లీ - చండీఘర్ - కులూ మధ్య తిరగాల్సిన విమానాలు ఆలస్యంగా బయల్దేరనున్నాయి. 50 డొమెస్టిక్ ఫ్లైట్స్ ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 18 విమానాలు కూడా ఆలస్యంగా రానున్నాయి.మంగళవారం తెల్లవారుజామున 5:30 గంటలకు సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీ వద్ద 7.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, పాలం వద్ద 8.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఉదయం 8:30 గంటల సమయంలో పాలం వద్ద 7.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, 50 మీటర్ల వరకు మాత్రమే విజిబిలిటీ కనిపించింది. సఫ్దర్‌జంగ్ వద్ద 6.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, 200 మీటర్ల వరకు విజిబిలిటీ కనిపించింది. ఢిల్లీ వ్యాప్తంగా చలి తీవ్రత అధికంగా ఉండటంతో బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.


ప్రజా సమస్యలను మీడియా ద్వారా ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా ఎదగాలనుకుంటున్నారా?

అయితే రండి.

రెండు తెలుగు రాష్ట్రాల లోని 294 నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్

మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)

రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం

అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని (Master Key) సాధిద్దాం

వివరాలకు సంప్రదించండి

AP : 88869 11944

TS : 76600 27678, 88860 90484

# రాంగోపాల్ వర్మ ను రాష్ట్ర బహిష్కరణ చేయాలి



తిరుపతి ప్రజాపాలన ప్రతినిధి: అనంత వీధి కూడలి నందలి కాపు సంక్షేమ సేన కార్యాలయం నందు సినీ దర్శకులు రామగోపాల్ వర్మ ట్విట్టర్ వేదికగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి తెలుగుదేశం అధ్యక్షులు నారా చంద్రబాబు గారి ఇంటికి రాజకీయ స్థితిగతుల విశ్లేషణ చేయడానికి వెళ్తే, వర్మ గారు కాపు కులం ను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ కాపు కులం ను డబ్బుకు అమ్మేసారని రిప్ కాపులు కంగ్రాట్యులేషన్స్ కమ్మ వారు ని కులాలను నిందించారు. ఈ సందర్భం కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వర్మ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర బహిష్కరణ చేయాలనీ మరియు అతని సినిమాలపై నిషేధం విధించాలని డిమాండ్ చేసారు. తరువాత జిల్లా యువసేన అధ్యక్షులు రాజు రాయల్ మాట్లాడుతూ సమాజంలో పార్టీపరంగా విమర్శలు చేయాలనీ కులంను ఉద్దేశించి వర్మ ఇలా మాట్లాడడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి కృష్ణయ్య, వి.ఎస్. హేమంత్, మూర్తి, హరి, రామారావు తదితర సభ్యులు పాల్గొన్నారు

## ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



హిందూపురం: ప్రజాపాలన ప్రతినిధి: స్థానిక పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్. నంబూరి సుమంత్, సెక్రటరీ టి.ఎస్ రాఘవేంద్ర నేతృత్వంలో ఈ వైద్య శిబిరం బాలాజీ టాకీస్ రోడ్డులో గల రోటరీ క్లబ్ లో చేపట్టారు. కర్నూల్ శ్రీ చక్ర హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ. ప్రదీప్ కుమార్ సహకారంతో అప్తాలమిస్ట్ అశోక్ కంటి వైద్య శిబిరంలో రోగులను పరీక్షించారు. ఆయనతో పాటు స్తానిక గౌతమ్ క్లినిక్ కంటి వైద్యులు డాక్టర్ అశ్వర్తరెడ్డి చేయూత అంధించారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్,ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి సుమారు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి,25 మందిని ఆపరేషన్లు కోసం కర్నూలు హాస్పిటల్ కు తీసుకెళ్లి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు అన్నారు. ఈ.హెచ్. ఎస్.హెల్త్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు వున్న పట్టణం ప్రజలతో పాటు సమీప గ్రామ ప్రాంత పేద ప్రజలు ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొన్నారు.ఈ కార్యక్రమంలో గౌతమ్ క్లినిక్ డాక్టర్ అశ్వర్త రెడ్డి, ఎల్ఐసి ఓబుల కొండయ్య,ఆదినారాయణ, శివయ్య ,శివప్రసాద్,గిరిధర్, తులజాబాయి , హిందూపురం బ్యాంక్ అసోసియేషన్ నాయకులూ ప్రసన్న,రమేష్ కె. నారాయణ,స్థానిక ప్రజలు, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ హొంగార్డు హొమ్ గార్డు కు ఆర్ధిక చేయూత...



శ్రీకాకుళం జిల్లా న్యూస్:.ప్రజాపాలన ప్రతినిధి: ఉద్యోగ విరమణ పొందిన హొమ్ గార్డు నకు జిల్లా హొమ్ గార్డులు ఒక్క రోజు సమకూర్చిన గౌరవ వేతనం చెక్కును ఆర్ధిక సహాయం గా కె ఎన్ అప్పారావు నకు ఎస్పీ జి ఆర్ రాధిక అందజేసినారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా హొంగార్డు విభాగనాకి చెంది, శ్రీకాకుళం యూనిట్ నందు విధులు నిర్వర్తించి పదవి విరమణ చేసిన హొంగార్డ్ కె ఎన్ అప్పారావు నకు జిల్లాలోని హొంగార్డులు ఆర్ధిక సహాయంగా విరాళంగా ఇచ్చిన ఒక రోజు వేతనం రూ.4.32 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీమతి జి.ఆర్.రాధిక చేతులు మీదుగా అందజేశారు. ఆరోగ్యం దృష్టి పెట్టాలని ఆమె అన్నారు . ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళల మీకు తోడుగా ఉంటుందని బారోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి పి విటలేశ్వర్, ఆర్.ఐ.బి. ప్రేదిపు,హొంగార్డు కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ప్రోత్సహించాలి.....



శ్రీకాకుళం జిల్లా న్యూస్:ప్రజాపాలన ప్రతినిధి: చేనేత కార్మికులను ప్రోత్సాహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. చేనేత వస్త్ర ప్రదర్శనను కళింగ వైశ్య సంఘం కళ్యాణ మండపంలో 10 నుండి 12వ తేదీ వరకు ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సాహించాలన్నారు. ప్రాంత ప్రజలంతా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనలో పొందూరు, తోలాపి, బైరి సారంగపురం, చీరాల, ఆప్కో అక్కులపేట, అంపోలు, మచిలీపట్నం, లావేరు, వివిఎస్ పురం, తదితర 15 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. మగ్గం నుండి తయారు చేసిన వస్త్రాలనే నేరుగా విక్రయిస్తారని చెప్పారు. ఈ ఈ కార్యక్రమంలో చేనేత శాఖ సహాయ సంచాలకులు ఐ. ధర్మారావు, ఆప్కో మండల వాణిజ్యాధికారి టి. జగదీశ్వరరావు, సేల్స్ మేనేజర్, విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి, నాబార్డ్ చేయూత అభినందనీయం: వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, జనవరి 10, ప్రజాపాలన : ప్రకృతి వ్యవసాయం చేసేందుకు, నాబార్డ్ వారు రైతాంగానికి అందిస్తున్న చేయూత అభినందనీయమని, వ్యవసాయ సలహా మండలి (ఆర్ బి కే) చైర్మన్ రమణారెడ్డి కావూరి రమణారెడ్డి అన్నారు. చీరాల మండలం తోట వారిపాలెం పంచాయతీ, ఆర్ బి కే సెంటర్ నందు, కషాయాలు, జీవామృతాల తయారీ విధానం పై మహిళా రైతులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమంలో, ముఖ్య అతిథిగా చైర్మన్ రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రమణా రెడ్డి మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా, వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు లు, రైతుల అభ్యున్నతి పట్ల, ప్రత్యేకంగా చూపుతున్న శ్రద్ధ స్ఫూర్తిదాయకమని, అందుకే రైతులు వారికి జీవితాంతం రుణ పడి ఉంటామని పేర్కొనడం, గర్వంగా ఉందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం, చీరాల ఎమ్మెల్యే, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జ్ చేస్తున్న పలు అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరు ఆర్థికంగా నిలద్రొక్కుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కావూరి రమణారెడ్డి తో పాటు, సభ్యులు గండూరు. వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ అధికారి ఆసోది. శ్రీనివాసరెడ్డి,నాబార్డ్ అధికారులు, ఆర్బికే అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు



చీరాల, జనవరి 10, ప్రజాపాలన : పదో తరగతి పరీక్షా ఫలితాలలో, నూటికి నూరు శాతం సాధించడమే లక్ష్యంగా, పాఠశాల హెచ్ఎంలు కృషి చేయాలని, బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు.చీరాల లోని, ఏపీ మోడల్ స్కూల్ , కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, భవిత కేంద్రాలని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పాఠశాల నిర్వహణ సక్రమంగా అమలు చేయడంలో, ప్రధానోపాధ్యా యులు శ్రద్ధ వహించాలని అన్నారు. నాడు - నేడు క్రింద, ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల పనితీరు ని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని, పని చేయకుండా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం కింద, వాడు తున్న వంట సరుకుల నాణ్యత ని పరిశీలించి, తగు సూచనలు చేశారు.పాఠశాల పరిసరాలను, పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విద్యార్థులకి నాణ్యమై న విద్యను, అందించేందుకు కృషి చేయాలని కోరారు. సంక్రాంతి పండుగ సెలవుల తర్వాత, పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల కి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వంద శాతం ఉత్తీర్ణత కోసం, కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా సైన్స్ ఫెయిర్ నిర్వహణ కోసం, అనువైన ప్రాంతాలని గురించి చర్చించా రు. డీఈఓ వెంట నాడు - నేడు నోడల్ ఆఫీసర్ పి. సుబ్రహ్మణ్యే శ్వర రావు, చీరాల మండల విద్యాధికారి డి.నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, సైన్స్ బాపట్ల జిల్లా కో-ఆర్డినే టర్ పవని భాను చంద్ర మూర్తి, ఆర్వీ రమణ తదితరులు ఉన్నారు.

## సామాజిక సేవా దృక్పథంతో వైద్య సేవలందించడం ప్రశంసనీయం: వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్



చీరాల, జనవరి 10, ప్రజాపాలన : వ్యాపార దృక్పథంతో కాకుండా, సామాజిక సేవా దృక్పథంతో, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం ప్రశంసనీయమని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.తాడివలస దేవరాజు ను, వైయస్సార్సిపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు అభినందించారు.మున్సిపల్ పరిధిలో పదో వార్డ్ కౌన్సిలర్ గోలి స్వాతి రవి కుమార్ ఆధ్వర్యంలో, 10వార్డులో జరుగు తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా, చీరాల వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ కరణం వెంకటేష్ శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ను సందర్శించారు. హాస్పిటల్ సిబ్బందితో మాట్లాడారు. అత్యవసర వైద్యసేవలు అందించడంలో సిబ్బందిసేవలను అభినందించారు. కార్యక్రమం లో వైయస్సార్సీపి నాయకులు బుర్ల వెంకట్రావు, బుర్ల మురళీకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్మన్ జైసన్ బాబు, హచ్ రమేష్, శ్రీ కామాక్షి కేర్ హాస్పి టల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, తాడివలస సురేష్, డాక్టర్ పంబ నరేష్, మోపిదేవి శ్రీనివాస్, తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ మల్లెల లలిత రాజశేఖర్, పూర్వి స్కాన్ డాక్టర్ పేట శ్రీకాంత్, వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి గృహనిర్బంధం అప్రజాస్వామికం: పోలీసుల తీరును ఖండించిన ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, జనవరి 10, ప్రజాపాలన : టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి గృహనిర్బంధం, అప్రజాస్వామి కమని,ఎమ్మెల్యే డోలా ఇంటి వద్ద పోలీసులు మోహరించి, నిర్బంధించడాన్ని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఖండించారు. తూర్పునాయుడుపాలెంలో, కొండపి ఎమ్మెల్యే నివాసం వద్ద, పోలీసుల మోహరింపు, భయానక వాతావరణం, సృష్టించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామిని గృహనిర్బంధం చేయడం తగదన్నారు. ఒక ప్రజా ప్రతినిధి బయట రాకుండా, అడ్డు కోవ డం ఏమిటన్నారు. ఎస్సీలపై దాడులకు వ్యతిరేకంగా, నిరసన కార్య క్రమం చేపట్టి, తెలుగుదేశం పార్టీ చలో కావలి కి పిలుపునిచ్చిం దన్నారు. కావలిలో బాధిత దళిత కుటుంబాన్ని, పరామర్శించడం రాజ్యాంగ విరుద్ధమా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ నాయకులను, ఎక్కడికక్కడ అడ్డుకుని, గృహ నిర్బంధం చేయించడం, అరెస్టులు చేయడం, ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులను, ప్రజా ప్రతినిధులను నిర్బంధించడానికి ఉపయోగించడం దారుణం అన్నారు.

## అమ్మ సేవా నిలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు నిత్య అవసరాల పంపిణీ



పొన్నూరు జనవరి10( ప్రజా పాలన ప్రతినిధి) :రోటరీ క్లబ్ పొన్నూరు వారు రోటరీ గవర్నర్ విజిట్ సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలోని అమ్మ సేవా నిలయం నందు అనాథలకు రోటరీ గవర్నర్ టి రాజశేఖర్ చేతుల మీదుగా రూ 10,000 విలువ గలిగిన నిత్య అవసరాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమాన్ని నడుపుతున్న ఆంటోనీ స్వామి ను ఆయన అభినందించారు. ఆయన చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రోటరీ విద్య వైద్యం పై అనేక రకాలుగా సేవలు అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్ష కార్యదర్శులు బి రామారావు ,శ్రీనివాసరావు సీనియర్ సభ్యులు పి రవీంద్రనాథ్, బి వీ చౌదరి, ఎన్ మేఘనాథ్, బాలకృష్ణ, ఎస్ రమేష్, వెలగా వెంకటేశ్వరరావు, తోట భాను, గోగినేని రాధాకృష్ణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

## జగనన్న పార్టీ నాయకులను మాకు పెన్షన్లు రావడం లేదని వాస్తవాలు మాట్లాడిన మహిళలపై కేసులు.. దీన్ని ఖండించిన జనసేన పార్టీ



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన ముస్లిం వర్గానికి చెందిన షేక్ ఫాతిమా రమీజాలపై వైయస్ఆర్సీపీ రౌడీలు చేసిన దాడిని జనసేన పార్టీ విజయవాడ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్ర ప్రజలు ఎన్ని గెలిపించి వాళ్లకు జరుగుతున్న బాధలను తెలియజేయడం తప్పు. పథకాలు రావట్లేదు మిమ్మల్ని నమ్ముకుని తిరిగ%శీ% ఇబ్బంది పడుతున్నామంటే అండగా ఉండాల్సింది పోయి ఇంటికి వెళ్లి దాడి చేస్తారా.దేవినేని అవినాష్ పై అతని అనుచరులపై తక్షణమే కేసు నమోదు చేయాలి..ఈ ఘటన తో అవినాష్ ఓటమి ఖరారు అయిపోయింది.మహిళలపై దాడి చేయడం హేయమైన చర్య..సీఎం జగన్ మీ ఇంటికి కూత వేటు దూరంలో విజయవాడ రాజధాని ఈ ఘటన జరిగింది ఈ ఘటనపై స్పందించాలి బాధితులకు అండగా నిలవాలని డిమాండ్ చేస్తున్నాం... స్థానిక కార్పొరేటర్ డివిజన్లో రావటం లేదని ఆ కార్పొరేటర్ వల్ల మాకు ఎటువంటి లాభం లేనటువంటి వ్యక్తిని సాక్షాత్తు విజయవాడ తూర్పు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేవినేని అవినాష్ మహిళలు పెద్ద ఎత్తున వివరించగా ఓట్లేసి ప్రభుత్వాన్ని గెలిపించినటువంటి మహిళలను అడిగినందుకు జగన్ ప్రభుత్వం నాయకులు మరుసటి రోజు ఆ మహిళలపై లేనిపోని కక్ష సాధించారు ఈ విషయాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన మహేష్ అన్నారు...

## 34వ డివిజన్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 34వ డివిజన్ లో 164వ రోజు గడప గడపకు మన ప్రభ్యుత్వం కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ఆయా ప్రాంతాలలో పర్యటించి గడప గడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేస్తూ సమస్యలు అడిగితెలుసుకున్నారు.అనంతరం సచివాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అందరికీ సంక్షేమ పథకాలు వస్తున్నాయని తెలిపి ప్రజలు మమల్నిఆశీర్వదిస్తారన్నారు.అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో గడప గడపకువెళ్తున్నామన్నారు.సంక్షేమ పథకాల అమలు తీరు పరిశీలిస్తున్నామన్నారు.వి ఎం రంగా కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి కట్టుబడి వున్నామన్నారు.కొంత డ్రైనేజ్ సమస్య వుందినీ దానిని త్వరితగతిన అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు.డివిజన్ అభివృద్దే తమ లక్ష్యం అన్నారు.పవన్ కళ్యాణ్ మాట్లాడేవి అన్ని అబ్బద్దలన్నారు.పవన్ కి విజన్ లేదన్నారు.అసలు పార్టీ వుంటుందా టీడీపీ లో కలిసిపోతుందా అని ప్రశ్నించారు.స్థిరత్వం లేని పార్టీ జనసేన అన్నారు.ఒంటరిగా పోటీ చేసే దమ్ము వున్న పార్టీ వైకాపా అని అన్నారు పవన్ కళ్యాణ్ మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడన్నారు. రాజకీయాలలోపనికిరాడన్నారు.11 మందిని చంపిన వ్యక్తి సన్మానించిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి 34వ డివిజన్ కార్పొరేటర్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశిల, డివిజన్ నాయకులు కార్యకర్తలు,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు,వివిధ కార్పొరేషన్లచేర్మెన్లు,డైరెక్టర్లు,పార్టీ నాయకులూ, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది వాలంటరీస్ మరియు నగరపాలక సంస్థ మరియు రెవిన్యు అధికారులు తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కే బుడుగంటపల్లి పంచాయితీ వీధి దీపాలు కొత్త పైప్ లైన్ తో వీధి కులాయిలు పనులు ముమ్మరం చేసిన సర్పంచ్ వైస్ సర్పంచ్



:రైల్వే కోడూరు ప్రజాపాలన ప్రతినిధి: :అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని కే బుడుగుంటుపల్లి పంచాయతీ సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్, ఇరువురు కలిసి కే బుడుగుంట పల్లి పంచాయతీ అంతా ప్రతి గ్రామంలో నీటి కుళాయిలు కొత్త పైపులైన్లు మరియు కే బుడుగుంటుపల్లి నుంచి బుడుగుంటుపల్లి హరిజనవాడకి మూడు కిలోమీటర్ల కొత్త పైప్ లైన్ వేసి నీళ్లు సరఫరా చేయడం జరుగుతుంది దీనికొరకు కొత్త బోర్ వేయటం జరిగింది మరియు ప్రతి గ్రామంలో వీధి దీపాలు ఎక్కడ వీధిలో కంపు చెట్లు ఉన్న వీధులు శుభ్రం చేయుట తాగునీటికి పంచాయతీలో ఏ ఒక్కరు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో పనిచేయటం జరుగుతుందని సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ మరియు ఉప సర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్ అన్నారు.

## అంగన్వాడి భవనానికి భూమి పూజ కార్యక్రమం లో పాల్గొన్న బియ్యపు పవిత్ర రెడ్డి



ప్రజా పాలన ప్రతినిధి శ్రీకాళహస్తి :తొట్టంబేడు మండలం , కంచనపల్లి గ్రామం నందు ఎమ్మెల్యే సహకారంతో 13లక్షల వ్యయంతో నూతన అంగన్వాడీ భవనముకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంఛార్జి శ్రీపవిత్ర రెడ్డి బియ్యపు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఎంపిపి ఉన్నం వాసుదేవ్ నాయుడు,సర్పంచ్ పద్మమ్మ,చంద్రయ్య నాయుడు,శ్రీరాములు రెడ్డి,కృష్ణ మూర్తి,గిరి రెడ్డి,అలయ్య,కుమార్ రెడ్డి,సుధీర్ రెడ్డి,కే.ధనంజయ రెడ్డి,పి ధ్ననాజయ్ రెడ్డి,వైస్ సర్పంచ్ గోవిందయ్య, కే.సుబ్బరాయలు,సురేష్ బాబు,సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరో అస్త్రం"యువశక్తి": అక్కల రామ్మోహన్ రావు గాంధీ



జి.కొండూరు:జనవరి 10(ప్రజాపాలన ప్రతినిధి):మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జ్ అక్కల రామ్మోహన్ రావు గాంధీ మంగళవారం పత్రిక ముఖంగా మాట్లాడుతూ ఈనెల 12వ తారీఖున జరిగే యువశక్తి కార్యక్రమాన్ని యువత జయప్రదం చేయవలసిందిగా అయన కోరారు. ఈ సందర్భంగానే యలమంచిలి నియోజకవర్గాన్ని పర్యటించి,యువ శక్తి కార్యక్రమం ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే యువతకు చేస్తున్న అన్యాయం పై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ యువశక్తి కార్యక్రమం అనేది యువకులు గళం చెప్పడానికి మంచి వేదికని ఆయన అన్నారు. అలాగే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రజా పాలన స్నేహ టీవీ క్యాలెండర్ ను ఆవిష్కరించిన మండల తెలుగు యువత అధ్యక్షులు గుండా శివప్రసాద్



ప్రజా పాలన గోకవరం జనవరి 10 :తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన గోకవరం లో మంగళవారం తెలుగు యువత అధ్యక్షులు గుండా శివప్రసాద్ ప్రజా పాలన స్నేహ టీవీ క్యాలెండర్ ని ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన పేపర్ ద్వారా ప్రజలకు నూతన సంవత్సరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ నిజాలు నిర్భయంగా ప్రజలకు ప్రసారం చేస్తున్న ప్రజా పాలన మరింత ఆదరణ పొందాలని కోరారు ఈ నూతన సంవత్సరంలో ప్రజలు పాఠకులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి మీడియా కోఆర్డినేటర్, కృష్ణునిపాలెం టీడీపీ అధ్యక్షులు కొంగరపు. రాజు టీడీపీ నాయకులు మేడి. నాగు,బంటుమిల్లి. సురేష్,ఎద్దు.కృపావరం తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం కోలనీలో డ్రైయిన్ నిర్మాణానికి శంకుస్థాపన ఎంపీపీ సుంకర




ప్రజా పాలన గోకవరం జనవరి 10 తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన గోకవరం గ్రామంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక గల ముస్లిం కోలని లో నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులకు మంగళవారం గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం కోలనీలో డ్రైన్లు లేకపోవడం వల్ల మురుగు నీరు వెళ్లడానికి సరైన దారి లేక ఈ ప్రాంతవాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు వారి ఇబ్బందులను గమనించి ముస్లిం కోలనీలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు 5 లక్షలు నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పులపర్తి బుజ్జి వరసాల ప్రసాద్ ఎంపీటీసీ తోలేటి రాంప్రసాద్ కర్రీ సూరరెడ్డి కొలిపాకల ప్రకాష్ వక్స్ బోర్డ్ డైరెక్టర్ అలీషా బొర్రా రాజేష్ పాల్గొన్నారు

# మైలవరం నియోజవర్గంలో గెలుపు ఎవరిది?

## రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం



జి.కొండూరు:జనవరి 10, (ప్రజాపాలన ప్రతినిధి):మైలవరం నియోజకవర్గంలో గెలుపు ఎవరిది?నీదా-నాదా అన్న విధంగా ఉత్కంఠ భరితంగా వుంది. అసలు వైకాపా పార్టీ తరపున సీటు ఎవరిది?మరలా సీటు వసంతకే వస్తుందా?లేక జోగి రమేష్ కి వస్తుందా?అనే సందేహం కొందరిలో ఊగిసలాడుతుండగా, మరో వైపు తెలుగుదేశం పార్టీలో ఉమామహేశ్వరరావు మైలవరం నుండి ఎమ్మెల్యేగా టికెట్ వస్తుందా? లేక బొమ్మసాని సుబ్బారావుకి టికెట్ దక్కుతుందా? లేక టిడిపి-జనసేన పొత్తులో భాగంగా మైలవరం నియోజకవర్గం జనసేన అభ్యర్థికి టికెట్ లభిస్తుందా?అనే సందేహాలు కొందరిలో ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. ఈ తరణంలో జోగి రమేష్ పెడన నియోజవర్గం వదిలి,మైలవరం నియోజకవర్గానికి రావాలని తన స్థానిక నియోజకవర్గంలో పోటీ చేస్తానని, తన వర్గీయులు ద్వారా నిన్నా-మొన్నటి వరకు ప్రచారం జరిగింది. దీంతో వసంత-జోగి మధ్య మొన్నటి వరకు కీచులాటలు జరిగాయి. ఈ పరిణామాలతో పార్టీ అధినాయకత్వం ఇద్దరని పిలిచి,వారి మధ్య ఉన్న వివాదానికి అడ్డుకట్టు వేశారు. ఒకవేళ పార్టీ అధిష్టానం వసంతను కాదని-జోగి రమేష్ కి టికెట్ ఇస్తే,జోగి రమేష్ ఓడిపోవడం ఖాయమని పలువురు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు. మైలవరం నియోజకవర్గంలో జోగి రమేష్ కి పూర్తి వ్యతిరేకత ఉందని,అందుకే గతంలో కూడా ఓటమి చెందారు. నియోజవర్గంలో కమ్మ సామాజిక వర్గం,రెడ్డి సామాజిక వర్గం,ఎస్సీ సామాజిక వర్గం ఓట్లు వ్యతిరేకంగా ఉన్నాయని వామ్మో జోగి రమేష్ గెలిస్తే ఏమైనా ఉందా?అనే భయం నియోజవర్గ ప్రజల్లో ఉంది. జోగి రమేష్ మంచి నాయకుడే అయిన,ఆయన పెడన నియోజవర్గం నుండి రెండుసార్లు పోటీ చేసి గెలిచారు. మంత్రిగా పదవి కూడా వరించింది. మూడోసారి కూడా పెడన నుండే పోటీ చేసి హ్యాట్రిక్ సాధించాలని కొందరు కోరుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టిడిపి అభ్యర్థి దేవినేని ఉమా గట్టి నాయకుడని,అతని ఓడించాలంటే వసంత కృష్ణ ప్రసాద్ వల్లనే సాధ్యపడుతుందని,ఇప్పటికే నియోజకవర్గంలో వసంతకు ఎంతో ప్రజాదారణ వుందని,వివాదాలకు పోనీ,విశ్వసనీయత కలిగిన నాయకుడుగా వసంత గుర్తింపు పడ్డాడని,వసంత వలన మరో రెండు,మూడు నియోజకవర్గాలు గెలుపు బాటలో ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వసంత కృష్ణ ప్రసాద్ ముక్కుసూటి మనిషి,కలుషితం లేని నాయకుడని,ఆ ముక్కుసూటి తనాన్ని స్వపక్షంలోని కొందరు నాయకుల వసంత పై అవ్వాకులు-చవ్వాకులు పేలుస్తూ రాజకీయ బురద జలుతున్నారని అలాంటి వారి మాటలను పట్టించుకోకుండా, వసంత తన పని తాను చేసుకుంటూ పోవాలని,మైలవరం నియోజకవర్గం టికెట్ వసంతకే వస్తుందని,కార్యకర్తల్లో-ఓటర్లలో మంచి నమ్మకం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది-ఏమైనా మైలవరం నియోజవర్గం నుండి టిడిపి,వైకాపా, జనసేన పార్టీలు ఏ అభ్యర్థికి టికెట్స్ వస్తుందో? ఎవరు ఎన్నికల్లో విజయం సాధించనున్నారో? తెలియాలంటే ఇంకా కొన్ని నెలలు వేచి ఉండాల్సిందే!

## తొలగించిన పింఛను పునర్దించాలి: ఎంపిటిసి గళ్ళ కృష్ణ



ప్రజా పాలన గోకవరం జనవరి 10 :తొలగించిన నెల్లి రవణమ్మ పెన్షన్ పునరుద్ధరించాలని గోకవరం మండలం గాదెలపాలెం ఎంపిటిసి గళ్ళ కృష్ణ ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లా కలెక్టర్ వార గోకవరంలో పర్యటనలో భాగంగా ఈ సమస్యపై వినతి పత్రాన్ని కలెక్టర్ గారికి సమర్పించారు అయినా ఈ సమస్యకు పరిష్కారం అందలేదని నెల్లి రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎంపీటీసీ గల్లా కృష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్లో భాగంగా వృద్ధులు వికలాంగులు వితంతువు మహిళల పెన్షన్లు వైసిపి ప్రభుత్వం అన్యాయంగా తొలగిస్తుందని అన్నారు వికలాంగురాలుగా ఎన్నో సంవత్సరాలుగా అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ 250 రూపాయల మొదలుకొని ఇప్పటి వరకు పింఛన్ పొందుతున్నటువంటి వికలాంగురాలైన నెల్లి రమణమ్మకు తొలగించిన పెంచను తిరిగి పునరుద్ధరించాలని లేనియెడల నెల్లి రమణమ్మ తరఫున తెలుగుదేశం పార్టీ ఆందోళన చేపదుతుందని ఆయన హెచ్చరించారు

## విమలాభానుతో టిపిసిసి ఉపాధ్యక్షురాలు పద్మావతి మర్యాదపూర్వక భేటీ



జగ్గయ్యపేట జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి:నల్గొండ పార్లమెంట్ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి కోదాడ మాజీ ఎమ్మెల్యే మరియు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు పద్మావతి మంగళవారం చిట్యాల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ని దర్శించుకొన్నరు. అనంతరం జగ్గయ్యపేట పట్టణం లోని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను స్వగృహం లో విమలభాను ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి సామినేని విమలభానుని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సంక్రాంతి పర్వదినం సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు మహిళా నేతలకు విమలభాను,పద్మావతి గారు చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది.

## పజాస్వామిక హక్కులను "కాలరాసేందుకే జీవో నెంబర్ 1"



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తున్నారంటూ దానిలో భాగంగా ఈ నెల రెండవ తేదీన అమలులోకి తెచ్చిన జీవో నంబర్ 1 రాష్ట్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటాలకు అడ్డుకునేందుకే ఈ జీవో వచ్చిందని,జై భీమ్ భారత్ పార్టీ నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి గోదా జాన్ పాల్ అన్నారులి రాష్ట్రంలో గత ప్రభుత్వాల లో లేనివిధంగా ప్రస్తుత ప్రభుత్వంలో దళిత కుల ప్రజా సంఘాలు ప్రతిపక్ష పార్టీలతో సహా ప్రతి ఒక్క పౌరుడు ప్రతి ఒక్క కులానికి అన్యాయం జరిగిందంటూ, రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుంది, తమ హక్కులను కాల రాస్తున్నారంటూ వివిధ రూపాలలో ధర్నాలు నిరసనలు రాస్తారోకోలు చేయగా, కోర్టులు కూడా ప్రభుత్వం తీసుకున్న అనాలోచితమైనా నిర్ణయాలను వ్యతిరేకించే విధంగా తీర్పులు వచ్చినప్పటికీ నిస్సిగ్గుగా నేటికీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు చాలా బాధాకరమని గతంలో లిజగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడానికి పాదయాత్రలు, బస్సు యాత్రలో ఎన్నో రూపాలలో కార్యక్రమాలు కేవలం రోడ్ల పైన మాత్రమే జరిగాయిలి అన్న విషయాన్ని జగన్ మోహన్ రెడ్డి మరిచిపోయాడని రేపు తిరిగి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే మరల ఇటువంటి జీవో అతనికే నష్టపరిచే విధంగా ఉంటుందని, అధికారంలో ఉండి కూడా మీరు అమలు పరుస్తున్న జీవో ప్రతిపక్షాలు ప్రజాసంఘాలకు ఒకలాగా అధికార పార్టీకి ఒకలాగా వ్యవహరించడం కూడా ప్రజలు గమనిస్తున్నారని కచ్చితంగా వాక్ స్వాతంత్రాన్ని ప్రజాస్వామిక విధానాలను ఖూనీ చేసే ప్రయత్నం లిజగన్మోహన్ రెడ్డి మానుకోకపోతే పూర్తిస్థాయిలో తమ అధికారాన్ని కోల్పోయి శంకరగిరి మాన్యాలు పట్టక తప్పదనిలి ఇప్పటికైనా లిజీవో నెంబర్ 1 ని రద్దుపరచాలనిలి లేనిపక్షంలో జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున కార్యాచరణకు పిలుపునిస్తామని లిజై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి గోదా జాన్ పాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన


సంపాదకీయం

బుధవారం 11, జనవరి 2023

# సర్పంచుల వెన్ను విరిచారు!

గ్రామపంచాయితీల రాజ్యాంగబద్ధత కోసమూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమూ ఏపీలోని సర్పంచులు రాజకీయాలకు అతీతంగా ఐక్య కార్యాచరణలతో తీవ్ర ఆందోళనలకు నేడు సిద్ధమవుతున్నారు. రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాలను ఆహ్వానించి మద్దతును కోరుతున్నారు. 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా గ్రామ పంచాయితీలకు కేంద్రం నుంచి లభించిన సుమారు రూ. 8,660 కోట్ల నిధులను జగన్ ప్రభుత్వం అక్రమంగా తీసుకుని సర్పంచుల వెన్నువిరిచిందని వాపోతున్నారు. దీనికితోడు గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా గ్రామ పంచాయితీలను నిర్వీర్యం చేస్తూ స్థానిక ప్రభుత్వాల గొంతు నులిమి వాలంటీర్లతో 'జగన్ సమాంతర ప్రైవేటు పాలన' సాగిస్తున్నాడని ఆగ్రహం చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఈ విధమైన కష్టాలను, దుఃఖాలను ఎదుర్కోలేదని సర్పంచులు వాపోతున్నారు. సుమారు పది ముఖ్యమైన డిమాండ్లతో ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు. వీరి డిమాండ్లు ఇలా ఉన్నాయి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్రం ఇచ్చే నిధులను గతంలో మాదిరి పంచాయితీలకే ఇవ్వాలి. సుమారు 12వేల మైనరు పంచాయితీలకు గతంలో మాదిరిగానే వీధి దీపాలకు, తాగునీటి పథకాలకు, పంచాయితీ ఆఫీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇవ్వాలి. పాత బకాయిలుగా చూపిస్తున్న ఆరు వేలకోట్ల విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి. కేంద్ర ప్రభుత్వం 12,918 పంచాయితీలకు 2018 నుంచి 2022 వరకూ పంపించిన సుమారు రూ. 8,660 కోట్లను పంచాయితీ అకౌంట్లలో జమ చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా సర్పంచులకు రూ. 12వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. ముఖ్యంగా వాలంటీర్లను, సచివాలయాలను పంచాయితీల ఆధీనంలోకి తీసుకురావాలి. ఇవీ ప్రధాన డిమాండ్లు. గ్రామంలో ప్రథమ పౌరుడిగా గౌరవం పొందే అవకాశం కోసమో, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి కీర్తి గడించాలనే కోరికతోనో సర్పంచ్ పదవి ఎన్నికల్లోకి అనేకమంది యువకులు, బలహీన వర్గాలవారు, మహిళలు తమ శక్తి మేరకు ఆర్థికంగా వెచ్చించి వస్తారు. కొందరయితే ప్రతిష్టకోసం అప్పులు చేసి మరీ ఎన్నికల బరిలోకి దిగుతారు. ఎన్నికల ఖర్చులో అగ్రస్థానంలో ఉండే ఏపీలో అనధికారికంగా సుమారు 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు పంచాయితీ ఎన్నికల్లో ఖర్చుచేసి గెలుస్తున్నారు. ఖర్చు చేసిన డబ్బులు తిరిగి రాబట్టుకోలేకపోతున్నామని కుమిలిపోయేవాళ్ళు కొందరయితే, ఆశించిన విధంగా గ్రామానికి ఏమీ చేయలేకపోతున్నామనే ఆవేదనతో కొందరు ఇవాళ రోడ్డునపడి ఆందోళనలకు దిగుతున్నారు. ప్రభుత్వం చివరకు రోడ్లపైన కూడా ఆందోళనలను చేయనియ్యకుండా నిర్భంద చట్టాన్ని కూడా ఇటీవలే తెచ్చింది. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, స్వపరిపాలనను ఆచరణీయం చేసేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన కృషి 1957 బల్వంతరాయ్ కమిటీ నుండి 1986లో ఎల్.ఎం.సింఘ్వి కమిటీ వరకూ సుదీర్ఘ కాలంపాటు సాగింది. స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధ అధికారాలను ఇచ్చే రాజ్యాంగ సవరణల కోసం 1989లో రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టింది. కానీ ఆ బిల్లు వీగిపోవడంతో 1992లో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు రాజీవ్‌గాంధీ సంకల్పాన్ని నెరవేర్చేందుకు, గ్రామపంచాయితీలకు రాజ్యాంగబద్ధ అధికారాలను అందించి ప్రజాస్వామ్యాన్ని మరింతగా పరిపుష్టం చేసేందుకు 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా సర్పంచ్‌లకు 29 అధికారాలను ఇస్తూ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. జగన్ ప్రభుత్వ విషయానికి వస్తే బలహీన వర్గాలకు తామే అధిక ప్రాధాన్యం ఇచ్చామని, సాధికారత కల్పించామని పదేపదే ప్రచారం చేసుకుంటున్నది. వాస్తవానికి డా. బి.ఆర్.అంబేడ్కర్ సామాజికన్యాయ లక్ష్యాన్ని ఆచరణీయం చేసే లక్ష్యంతో స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు మహిళలకు రాజకీయ రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధం చేసిందీ, బీసీ రిజర్వేషన్లకోసం రాష్ట్రాలకు అధికారాలు ఇచ్చిందీ కాంగ్రెస్ ప్రభుత్వమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మొత్తంగా 60.55శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను నిర్ణయించింది నాటి కిరణ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. దీనిపై హైకోర్టు నుంచి ప్రతికూలంగా తీర్పు వస్తే సుప్రీంకోర్టుకు వెళ్ళి 2013లో మధ్యంతర ఉత్తర్వులు పొంది 60.55 శాతంతో ఎన్నికలు నిర్వహించి చరిత్రలో అత్యధికశాతం బలహీనవర్గాలు స్థానిక సంస్థల్లో ఎన్నికయ్యే అవకాశాన్ని కల్పించింది కూడా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక 59.85 శాతం స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు నిర్ణయించి ఎన్నికలకు వెళుతున్నట్లు చెప్పారు. కానీ హైకోర్టు మళ్ళీ 50శాతమంటూ చెప్పడంతో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. నిపుణులైన న్యాయవాదులను సుప్రీంకోర్టులో పెట్టకపోవడంతో తిరిగి 50శాతంతోనే ఎన్నికలకు వెళ్ళాల్సి వచ్చిందనే విమర్శలు జగన్ ప్రభుత్వం పైన ఉన్నాయి. బలహీన వర్గాలకు చట్టబద్ధంగా ఉన్న రిజర్వేషన్లు తప్ప జగన్ ప్రభుత్వం అదనంగా కల్పించిందేమీ లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 60.55శాతం బలహీన వర్గాలకు అవకాశం కల్పించిన చరిత్ర ఇప్పటికీ గత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. ఇప్పటి విషయానికి వస్తే ఈ 50శాతం బలహీనవర్గాలు, అందులోని 33శాతం మహిళా సర్పంచులు గ్రామ ప్రభుత్వాధినేతలుగా సముచిత గౌరవం పొందుతూ, గ్రామాభివృద్ధిలో భాగం కావాల్సిన వారు జగన్మోహన్‌రెడ్డి పుణ్యమా అని, అతని నియంతృత్వ చర్యల కారణంగా ఈ రోజు రోడ్లెక్కుతున్నారు. ఇటీవల భారత్ జోడో యాత్రలో భాగంగా ఏపీకి పాదయాత్రగా వచ్చిన రాహుల్ గాంధీతో పలువురు సర్పంచులు చర్చా కార్యక్రమంలో పాల్గొని వారి గోడును వెల్లడించారు. జగన్ ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు చెందాల్సిన వేల కోట్ల రూపాయల నిధులను అక్రమంగా దారి మళ్ళించిందని, తమ హక్కులనూ అధికారాలనూ కాలరాస్తున్నదని, తాము గ్రామాభివృద్ధిని చేయలేక, ప్రజల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకుని ఆత్మహత్యలకు పాల్పడాలనే ఆలోచనలతో దీనస్థితిలోకి నెట్టబడ్డామని చెప్పారు. గ్రామాభివృద్ధి కోసం స్వంత ధనంతోపాటు అప్పులుచేసి మరీ వెచ్చించామని, బిల్లులు రాకపోవడంతో ఇప్పుడు తమ జీవితం సంక్షోభంలోకి నెట్టబడిందని చెప్తూ సర్పంచులు కన్నీటి పర్యంతమయ్యారు. సర్పంచుల దుఃఖానికి చలించిన రాహుల్ గాంధీ ఏపీ సర్పంచుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆ సందర్భంగా ఆయన, 'భారత స్వాతంత్ర్య సంగ్రామం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే కాదు ఏకకాలంలో మన దేశంలోని నియంతృత్వ రాజరికాలకు కూడా వ్యతిరేకంగా జరిగిన పోరాటం. 1950 తర్వాత మనం స్వంత రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలోకి ప్రవేశించాం. దురదృష్టవశాత్తూ 75 ఏళ్ళ తర్వాత దేశంలో ప్రజాస్వామ్యాన్ని క్రమంగా కాలరాస్తూ మనల్ని మళ్ళీ రాజరిక వ్యవస్థల్లోకి కొందరు పాలకులు తీసుకెళుతున్నారు. కేంద్రంలో ఒక రాజు, పక్కన తెలంగాణలో ఒక రాజు, ఆంధ్రప్రదేశ్‌లో ఒక రాజు పాలిస్తున్నట్లుగా ఉంది' అన్నారు. ఈ నూతన రాజరికాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సర్పంచులు పోరాడాలని ఏపీ సర్పంచ్‌ల డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# నెంబర్ వన్ నిర్బంధం



జీవోలో పేర్కొన్న కారణాలను చూసినప్పుడు అవి సహేతుకమైనవి కావని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆరవ పేరాలో పేర్కొన్న కారణాలన్నీ ఒక సంఘటనలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించినవి. వాటిని అన్ని సమావేశాలకూ ఆపాదించటంలో ఎటువంటి సహేతుకత లేదు. ఇప్పటిదాకా రహదారులపై కొన్ని వేల సమావేశాలు జరిగి ఉంటాయి. అలాంటి ఒక్క సంఘటనలో జరిగిన ప్రమాదానికి గల కారణాలను అన్ని సందర్భాలలో జరగటానికి అవకాశం ఉందని సూత్రీకరించటం సరైనదికాదు. ఇప్పటికీ ఆ సంఘటన మెజిస్టీరియల్ విచారణలో ఉందని అదే జీవోలో పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే ఆ కారణాలన్నీ కూడా నివారించదగినవి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని...నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగినవి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం. 1, ప్రజాస్వామిక హక్కులపై నెంబర్ వన్ నిర్బంధంగా ఉంది. జాతీయ, రాష్ట్ర రహదారులు, వీధులలో ప్రధానంగా సమావేశాలు నిర్వహించుకోవటానికి అనుమతించకపోవడం మంచిదని అధికారులకు సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోని తీసుకు వచ్చింది. అక్కడ సభలకు అనుమతిస్తే లాజిస్టిక్ చలనంపై వ్యతిరేక ప్రభావం పడుతుందని చెబుతున్నారు. అంటే...పోలీస్ చట్టం-1861, సెక్షన్.3 ఇచ్చిన పర్యవేక్షణ అధికారంతో సెక్షన్ 30 ప్రకారం సమావేశాలను క్రమబద్ధీకరించాల్సిందిగా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అలాగే మున్సిపాలిటీ, పంచాయితీ రహదారులపై కూడా సమావేశాలకు సాధారణ పరిస్థితులలో అనుమతించరాదని, కేవలం ప్రత్యేక పరిస్థితులలో అరుదుగా మాత్రమే అలాంటి రహదారులపై అనుమతించాలని ఆదేశించింది. ఈ రహదారులు ఇరుకుగా, సన్నగా ఉంటాయి. ఈ రహదారులు స్థానికంగా నివాసం ఉండే ప్రజలు స్వేచ్ఛగా తిరగటానికి ఉద్దేశించబడినవి. ఈ రహదారులలో ఎటువంటి అంతరాయం కల్గించినా అది ఆ ప్రాంత ప్రజల ప్రాణాలకు హాని ఏర్పడుతుంది. పౌర జీవనానికి, అత్యవసర సేవలకు ఆటంకం. సాధారణ ప్రజలకు అసౌకర్యం- అంటూ ఈ రహదారులపై నిషేధానికి చెప్పిన ప్రత్యేక కారణాలే కాకుండా సాధారణ కారణాలను కూడా ఇదే జీవోలో చెప్పారు. రహదారులపై సమావేశాలు పెట్టుకోవటం వలన సాధారణ ప్రజలకు భారీ అసౌకర్యం కలుగుతుందని, అలాగే రహదారులపై మీటింగ్ గాయాలకు, మరణాలకు కారణమౌతుందని చెప్పారు. ఈ జీవో 6వ పేరాలో కొన్ని కారణాలను ప్రస్తావించారు. రహదారులు లేక రహదారుల అంచున సమావేశాలు నిర్వహించటం వలన మరణాలు సంభవిస్తాయని, ట్రాఫిక్ అంతరా యం, వాహనాలకు భారీ అంతరాయం కలుగు తుందని అన్నారు. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దటానికి ఎక్కువ సమయం తీసుకుంటుందన్నారు. దీనివలన అనారోగ్యంతో వున్నవారు, వృద్ధులు, గర్భిణులు, గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్ళి చికిత్స చేయటానికి వీలుపడక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు.

## కారణాలు – సహేతుకత

జీవోలో పేర్కొన్న కారణాలను చూసినప్పుడు అవి సహేతుకమైనవి కావని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆరవ పేరాలో పేర్కొన్న కారణాలన్నీ ఒక సమావేశంలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించినవి. వాటిని అన్ని సమావేశాలకూ ఆపాదించటంలో ఎటువంటి సహేతుకత లేదు. ఇప్పటిదాకా రహదారులపై కొన్ని వేల సమావేశాలు జరిగి ఉంటాయి. అలాంటి ఒక్క సంఘటనలో జరిగిన ప్రమాదానికి గల కారణాలను అన్ని సందర్భాలలో జరగటానికి అవకాశం ఉందని సూత్రీకరించటం సరైనదికాదు. ఇప్పటికీ ఆ సంఘటన మెజిస్టీరియల్ విచారణలో ఉందని అదే జీవోలో పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే ఆ కారణాలన్నీ కూడా నివారించదగినవి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని...నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగినవి. ఆ సంఘటనలో నిర్వాహకుల లోపం ఎంత ఉందన్నది విచారణలో వెలుగు చూడవలసి ఉంది. ట్రాఫిక్ అంతరాయాలు, సాధారణ ప్రజల తాత్కాలిక అసౌకర్యాలు అనేకసార్లు అనేక రూపాలలో జరుగుతున్నాయి. మంత్రులు, ముఖ్యమంత్రుల పర్యటనలు, రాకపోకల సందర్భంగా జరుగుతుంటాయి. అనేక మతపరమైన, ఇతర సందర్భాలలో జరుగుతున్నాయి. అంతరాయాలు, అసౌకర్యాలు లేకుండా పోలీసులు ప్రజలను తాత్కాలికంగా ప్రత్యామ్నా య మార్గాలలో పంపించాలి. పోలీసుల పనే అది. అది కూడా చేయునప్పుడు, చేయలేనప్పుడు సెక్షన్ 30 అమలులో పోలీసులు వైఫల్యం చెందినట్లు. జాతీయ, రాష్ట్ర మున్సి పాలిటీ, పంచాయితీ రహదారుల న్నింటిలోను సమావేశాలు రద్దు చేయుడమంటే ఇంక ఎక్కడా నిర్వహించుకోవటం సాధ్యం కాదు. సమావేశాలు, ప్రదర్శనలు లాంటివి ప్రజాసా మ్యానికి ప్రాణం లాంటివి. ప్రాథమికమైనవి. అభిప్రాయాలను పంచుకో వటానికి, ప్రభుత్వాలకు తెలియ చేయటానికి అవి మార్గాలు. వాటిని అడ్డుకోవట మంటే ప్రజాస్వా మిక హక్కులపై ప్రత్యక్ష దాడికి దిగడమే.

## కోర్టులు ఏం చెప్పాయి ?

ప్రభుత్వం ఊహిస్తున్న ప్రమాదాలు వాస్తవ దూరమైనవి, ఊహాజనితమైనవి కాకూడదని... వాస్తవానికి దగ్గరగాను, ప్రత్యక్ష సంబంధం కలిగి వుండాలని కోర్టులు చెప్పాయి. ఈ విధంగా చూసినప్పుడు ప్రభుత్వం చెప్పిన కారణాలు చెల్లవు.

## నిషేధం అనే పదమే లేదా ?

ఆ జీవోలో నిషేధం అనే పదం లేదు. సమావేశాలు పెట్టుకోవద్దు అని మేమనలేదు అంటున్నారు. ఏ దరఖాస్తును అనుమతించవద్దు అంటే అది నిషేధం కాదా? అన్ని రహదారులను ప్రస్తావిస్తూ అనుమతి నిరాకరించమని ఆదేశిస్తే అది నిషేధం కాదా? కేవలం అరుదుగా మినహాయించదగిన కేసులలోనే అనుమతి ఇవ్వాలని ఆదేశించటం నిషేధం కాదా? అనుమ తించటానికి కారణాలు తెలియచేయాలని ఆదేశించటమంటే వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితిలోకి నెట్టివేయటమే. కాబట్టి ఆచరణలో ఇది నిషేధంగానే మారుతుంది.

## ప్రదర్శనలపై స్పష్టత

ఒకవేళ ప్రదర్శనలకు అనుమతి ఉంటే వాటిని జీవోలో ఎందుకు ప్రస్తావించలేదు? ఈ జీవో సాకుగా చూపి ప్రజా సంఘాలు చేస్తున్న ప్రదర్శలను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఈ జీవోలో కేవలం మీటింగ్‌లు అనే పదం ఉంది. ప్రదర్శనలకు పంబంధించిన ఎలాంటి పరిమితులు చర్చించలేదు. అలాగని వాటికి మినహాయింపు ఇస్తున్నట్లు సష్టంగా ప్రకటించ లేదు. ప్రభుత్వం దానిమీద స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ సలహాదారు ఇచ్చిన స్పష్టత అధికారయుతంగా ఉండాలి.

## ఆచరణ సాధ్యం కాని ప్రత్యామ్నాయాలు

జీవోలో చెప్పిన ప్రత్యామ్నాయ స్థలాలు, మైదానాలు ఎన్ని ప్రాంతాలు, నగరాలు, పట్టణాలలో గుర్తించబడి ఉన్నాయి? అవి ప్రజలకు అందుబాటులో లేకుండా, సభ నిర్వహణ అసాధ్యమనే పరిస్థితి ఉంటే అది నిషేధం కాదా? ఇప్పటివరకు అధికారికంగా చాలా కొద్దిపాటి నగరాలు, పట్టణాలలోనే అలాంటి స్థలాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించకూడదా? ప్రజా సమావేశాలకు ప్రైవేటు స్థలాలు ఎవరైనా ఇస్తారా? పబ్లిక్ మీటింగ్‌లను ప్రైవేటు స్థలాల్లో పెట్టుకోవలసిన దుస్థితి ప్రజాస్వామ్యంలో ఉంటుందా?

## సెక్షన్ 29పై స్పందన ఏది?

రెండు సంఘటనలు జరిగాయని పోలీస్ చట్టం-1861 సెక్షన్ 30ను రాష్ట్రమంతటా ప్రయోగించిన ప్రభుత్వాలు... పోలీసులు తమ కస్టడీలో ఉన్న వారిపై హింసను ప్రయోగించకూడదనే సెక్షన్ ఉల్లంఘనలకు సంబంధించి మాత్రం స్పందించలేదు. ఈ సెక్షన్ 29 ప్రకారం కస్టడీలో వ్యక్తులపై హింస నేరం. ఇంత వరకు పోలీసులు తమ కస్టడీలోని వ్యక్తులపై హింస ప్రయోగించలేదా?

## ప్రతిపక్షాలు- ప్రజాసంఘాలతో చర్చలు

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ముఖ్యంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేటప్పుడు రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలతో సంప్రదింపులు జరపాలి. సమావేశం ఏర్పాటు చేయాలి.

## సెక్షన్ 30 దుర్వినియోగం

ఈ సెక్షన్ నిరంతరం దుర్వినియోగం అవుతూంటుంది. సెక్షన్ 144 సి.ఆర్.పి.సి ప్రకారం పౌరహక్కులపై పరిమిత కాలం పాటు షరతులు విధించి నియంత్రించటానికి కార్యనిర్వాహక వర్గానికి అధికారం ఉంది. కాని ఆ పేరుతో అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలలో చట్టంలో పేర్కొన్న కాల పరిమితి కంటే ఎక్కువ సమయం నియంత్రిస్తున్నారు. ఆచరణలో రాజ్యాంగం ఇచ్చిన పౌరహక్కులను నిషేధిస్తున్నారు. ఈనెల 6న విజయవాడ కమిషనర్ ఇచ్చిన ('సాక్షి') ప్రకటన ప్రకారం జనవరి 6వ తారీకు నుంచి మార్చి 31వ వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుంది. అంటే ఒకేసారి 85 రోజులు ఈ చట్టాన్ని విధించారు. అంతటి ప్రత్యేక పరిస్థితులు (ప్రమాదాలు) ఏం ఉన్నాయో ప్రభుత్వమే చెప్పాలి. అన్ని నగరాలు, పట్టణాలలో ఈ చట్టాన్ని నిరంతరం ప్రయోగిస్తూనే ఉన్నారు.

## 1861 చట్టమా? 1859 చట్టమా ?

అసలు పోలీస్ చట్టం-1861 ఆంధ్ర ప్రదేశ్‌కి వర్తిస్తుందా అనేది సందేహం. ఎందు కంటే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకించి 1859లో ఆమోదించబడిన ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) డిస్ట్రిక్ట్ యాక్ట్- 1859, యాక్ట్ నెం. 24 (రోమన్ అంకెలు) ఆఫ్ 1859 ఉన్నది. ఈ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వాలకు పోలీసులపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. ఈ చట్టం ఉండగా 1861 చట్టం సెక్షన్ 3లో ఉన్న అధికారాలను ఉపయోగిస్తూ ప్రభుత్వం జీవో నెం. 1 తీసుకు వచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేక చట్టం ఉండగా వేరే చట్టాన్ని ఉపయోగించి జీవో తీసుకురావటమనేది చట్టపరంగా నిర్ధారణ కావాల్సి వుంది.


## 1861వ చట్టం మార్పు అవసరం

ప్రజాస్వామ్య పోలీసింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఈ చట్టం ఏ విధంగాను సహాయపడదు. ప్రభుత్వానికి పోలీసులపై ఎటువంటి మార్గదర్శకాలు, నియంత్రణలు లేని పర్యవేక్షణ అధికారాన్ని ఈ చట్టం ఇచ్చింది. ఫలితంగా పోలీసు వ్యవస్థలో రాజకీయ ప్రభావం విపరీతంగా పెరిగి...చట్టబద్ధంగా నడుచుకోవాల్సిన పోలీసులు...రాజకీయ నాయకుల చట్ట వ్యతిరేక సిఫార్సులకు తలొగ్గి పనిచేస్తున్నారు. పోలీసు జవాబుదారీతనానికి సరైన యంత్రాంగాన్ని ఈ చట్టం కల్పించలేదు. 1857లో జరిగిన సిపాయి తిరుగుబాటు తరువాత వచ్చిన ఈ చట్టం బ్రిటీషు అవసరాలకు అనుగుణంగా ఉన్నది. నేషనల్ పోలీసు కమిషన్ 1981లో ఇచ్చిన 8వ నివేదికలో ...ఒక నమూనా పోలీసు చట్టాన్ని తయారు చేసి అందించింది. అంటే 1861వ చట్టం స్థానంలో అలాంటి చట్టం వుండాలని సూచించింది.

## ఉపసంహరించాల్సిందే !

ఏదో ఒక కారణంతో ప్రశ్నించే వారి గొంతు నొక్కి పౌరహక్కులపై నిర్బంధం తీసుకురావటం సరైన చర్య కాదు. సభలు, సమావేశాలపై సహేతుక షరతులు విధించి ప్రజా భద్రతను, సౌకర్యాలను కాపాడవచ్చు. కనుక ప్రభుత్వం వెంటనే ఈ జీవోను ఉపసంహరించాలి.

# అలంకారం



శిఖర సౌందర్యం ప్రశంసనీయమే
అదే క్రమంలో లోయ సొగసు గొప్పదే
దేనికీ ఎప్పుడూ కంపించని
మనో ధారుఢ్యంతో పాటు
చలనసహితమైన జీవితాన్ని వదలకూదని
తెలియట్లా ?

అహంకారం , అనుమానం ప్రమాదమని
ఇప్పటికైనా తెలియక పోతే ఎట్లా?
మనిషి అవసరం కోసమే ఏదైనా
స్వీకరించడం,
ఇది చాలనుకోవడం సులకనేం కాదు
అది తక్కువతనం అంతకన్నా కాదు

కడలి కెరటం దూకుడు ఒకరైతే
నదీలో అల నడక మరొకరిది

ఎప్పుడూ దేనికీ ఇది లేదని, అది
లభించలేదని
దు:ఖించరాదని తెలుసుకోకపోతే ఎట్లా?
ఉన్నది చాలు
ఇక్కడుంటే చాలు
కీర్తి కిరీట ధారి ఒకరైతే
తలగుడ్డ వారసత్వం ఇంకొకరిది
ఇక్కడ ఒక మంచి మనిషిగా బతగ్గలగడమే
ఏ మనిషికైనా అందం, అలంకారం !

– రవి నన్నపనేని

## సిఐటియు జెండా ఆవిష్కరణ చేసిన జిల్లా కార్యదర్శి ఏ.కమల



నందిగామ జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి:కార్మిక హక్కులకై సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉ ధృతం చేసేందుకు సిఐటియు 17వ ఆలిండియా మ హాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా జండా ఆవిష్కరణలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ ల్ ఇండియా కమిటీ లో భాగంగా ఆంధ్రప్రదేశ్ సిఐ టి యు జెండాను జిల్లా కార్యదర్శి కమల ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూకార్మిక హక్కులు లేబర్ కోడ్స్ వల్ల కార్పొరేట్లకు అనుకూ లం గా బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్స్ ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు కనీస వేతనం అమలు చేయాలని సుప్రీంకోర్టు చెప్పిన దాని అమలుకు మోడీ ప్రభుత్వం పూనుకోకపోగా అంబానీ ఆధానేలకు సహకరించి విద్యుత్ సంస్థలను ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి కారు చౌ కగా కట్టబెట్టాలని చూస్తుందన్నారు కార్మిక పోరా టా లు ప్రభుత్వ మెడలో వంచుతాయని ఈ పోరాటమే నిదర్శనం అన్నారు కృష్ణపట్నం పవర్ ప్లాంట్ ను ఆ దానికి ఇవ్వడాని తప్పు పెట్టారు .దీని మీద కూడా ద శలవారీగా పోరాటం చేసే విజయం సాధిస్తామన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొన్ని రోజుల నుంచి జరుగుతున్న పోరాటంలో కార్మికులు వీరోచితంగా పోరాడుతున్నారన్నారుఈ కార్యక్రమం లో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కే గో పాల్, చందర్లపాడు కార్యదర్శి ఏసోబు, మండల కమి టీ సభ్యులు కర్రీ వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు పెసరమెయిల్ రవి బిల్డింగ్ యూనియన్ నాయకులు కలాం ట్రాన్స్పోర్ట్ నాయకులు షేక్ గౌస్ కృష్ణ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

## నయా దోపిడీదారులు మొండితోక సోదరులు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి పట్టణంలోని తెదేపా కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ మొండితో ఒక సోదరులపై మండిపడ్డారు నవ నందిగామ నిర్మా తలను చెప్పుకునే సోదరులు నిర్మాతలు కాదని న యా దోపిడీదారులని ఆమె ఎద్దేవా చేశారుమొండి తోక సోదరులకి ప్రజలే రానున్న రోజులలో తగిన బుద్ధి చెప్పనున్నారన్నారువైకాపా పార్టీ భ విష్యత్తు రోజులలో ఎక్కడ కనిపించకుండా భూస్థా పితం అ య్యేలా చేయడానికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉన్నా రన్నారు

## మావుళ్ళమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



భీమవరం, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :ఈనెల13 వ తేదీ నుండి ప్రారంభమయ్యే మావుళ్ళమ్మ అమ్మవారి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ఉత్సవ కమిటీకి సూచించారు. మావుళ్ళమ్మ ఉత్సవాలకు శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసును ఉత్సవ కమిటీ మంగళవారం ఆహ్వానించింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించాలని ఉత్సవాలలో లోటుపాట్లు లేకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఉ త్సవాలు జరుగుతున్న రోజుల్లో భక్తులు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి కూడా పెద్దఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని అన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం త్వరితగతిన జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ప్రతి ఏటా ఉత్సవ కమిటీ రేయింబవళ్ళు కష్టించి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నీరుల్లి కూరగాయల, పండ్ల వర్తకసంఘం అధ్యక్షులు తూటారపు ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్ కొప్పుల సత్యనారాయణ, రామాయణం గోవిందు , నరహరిశెట్టి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తాహసిల్దార్

నూజివీడు, ప్రజాపాలన ప్రతినిధి: సంక్రాంతి పండుగ సందర్భంగా నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేందర్ ఆధ్వర్యంలోమండలం స్థాయిలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్న మెంట్ రెండవ రోజు విజయవంతముగా నిర్వహించడం జరిగినది. ప్రథమ స్థానం జోన్స్, ద్వితీయ బహుమతి నెహ్రూ పేట టీములు విజయం సాధించాయి. బహుమతి ప్రదాన కార్యక్రమంలో నూజివీడు మండల తాహసీల్దార్ డి.వి.ఎస్.యల్లారావు, పట్టణ సిఐ ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవియా లు విజేతలకు ప్రథమ బహుమతి రూ.5,000 లు, ద్వితీయ బహుమతి రూ.4000 లు నగదును, మెమెంటోలు అందించారు. తహశీల్దారు గారు మాట్లాడుతూ ది.12-1-2023 నుండి ది.13-1-2023 తేదీలలో నూజివీడు డివిజన్ స్థాయిలో ఆటల పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, లింగ పాలెం, చింతలపూడి మండలాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానం గెల్చిన జట్లు పాల్గొంటాయని తెలిపారు.

# సమిష్టి కృషితోనే పార్టీ విజయవంతం: అంబటి రాంబాబు



సత్తెనపల్లి: ప్రజాపాలన: రానున్న ఎన్నికల్లో సమిష్టి కృషితో, ఐక్యంగా పనిచేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయాన్నందించాలని తిరుపతి శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జోనల్ కమిటీ సమన్వయకర్త భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయనతోపాటు రాష్ట్ర జల వనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు, జోనల్ కమిటీ సమన్వయ కర్త బీదా మస్తాన్ రావు లు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజవర్గాలలో పర్యటిస్తూ ముఖ్య నేతల సూచనలు, సలహాలు సేకరించి అధినేత దృష్టికి తీసుకెళ్తామన్నారు. మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా తెలియజేయవచ్చన్నారు. అంబటి రాంబాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గొంతుకని, ఆయన కార్యక్రమాలు స్ఫూర్తివంతంగా ఉ ంటున్నాయన్నారు. పార్టీ పెట్టినప్పటినుంచి జగన్మోహన్ రెడ్డి వెంట నడిచిన నమ్మకమైన నాయకుడన్నారు.రాజ్యసభ సభ్యులు జోనల్ కమిటీ సమన్వయకర్త బేధా మస్తాన్రావు మాట్లాడుతూ 70 సంవత్సరాల రాజకీయ చరిత్రలో బడుగులను రాజ్యసభకు పంపిన ఘనత ఒక వైఎస్ జగన్మోహన్ రెడ్డికే వైయస్సార్ పార్టీకే దక్కిందని వివరించారు చరిత్రలో గత ఎన్నడూ లేనివిధంగా బడుగు బలహీన వర్గాలకు అత్యధిక స్థాయిలో రాజ్యాధికారంలో ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు నియోజకవర్గంలో చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఉంటే పక్కన పెట్టి పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని సూచించారు.రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రములో సరికొత్త రాజకీయ రసాయనక చర్య ప్రారంభమైందని, దీన్ని చూసి భయపడాల్సిన పరిస్థితి లేదన్నారు. ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల పాలనకు జగన్మోహన్ రెడ్డి సుపరిపాలనకు బేరీజు వేసుకోవాలని సూచించారు. రూ.1 లక్ష 80 వేల కోట్లను పారదర్శకంగా, నేరుగా లబ్దిదారుల ఖాతాకే జమ చేసిన ప్రభుత్వం మనదన్నారు. విష పత్రికల్లో వచ్చే రాతలను చూసి భయపడాల్సిన పరిస్థితి లేదని వివరించారు. ఆ ఇద్దరు కలయిక ముందే ఊహించిందేనన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు వెన్న హనుమారెడ్డి,, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు, నిమ్మకాయల రాజనారాయణ, నరసరావుపేట పార్లమెంటు మహిళా నాయకురాలు, ఉమెన్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్ డాక్టర్ గీతా హసంతి, నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకవైపు సంక్షేమం.... మరోవైపు అభివృద్ధి

### 112వ రోజుకు చేరుకున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం
### ఎమ్మెల్యే గోపిడి శ్రీనివాస్ రెడ్డికి ప్రజల బ్రహ్మరథం
### మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని హారతులు ఇస్తూ గోపిరెడ్డికి స్వాగతం
### ఏడవ వార్డులో 6 కోట్ల 14 లక్షల రూపాయలతో సంక్షేమ పథకాలు





పల్నాడు జిల్లా .నరసరావుపేట. జనవరి 10. (ప్రజా పాలన ప్రతినిధి.): ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాన్ని చూసి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏడవ వార్డు కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి కార్యకర్తలు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. కనక తప్పెట్లతో మేళ్ల తాళాలతో, పూల జల్లులతో స్వాగతం పలికారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మళ్లీ మీరే రావాలంటూ అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలవాలంని మహిళలు దీవించారు. ప్రతి గడపకు వెళ్లి ఎమ్మెల్యే సంక్షేమ పథకాలు అందుతున్నాయూ లేవా అని తెలుసుకొని సమస్య ఉన్న చోట అక్కడే తక్షణం పరిష్కరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏడవ వార్డులో సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి చేపట్టామని అన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా ఏడవ వార్డులో 3,000 మంది ఓటర్లకు 6 కోట్ల 14 లక్షల రూపాయలతో సంక్షేమ పథకాలు అందించామని అన్నారు .వార్డులో అమ్మఒడి, చేయూత, వసతి దీవెన, వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని తెలిపారు. వార్డులో శివారు కాలనీలు సుబ్బారెడ్డి కాలనీ గతంలో అభివృద్ధి నోచు కోలేదని కేసపల్లి పంచాయతీలో ఉండటం వలన సరైన రోడ్లు లేక డ్రైనేజీ లేక మంచినీళ్లు లేక ప్రజల ఇబ్బంది పడ్డారని , ఇప్పుడు ఆ ఏరియా మొత్తం మున్సిపాలిటీలో విలీనం చేశామని ఇప్పుడు సుమారు కోటి అరవై లక్షలతో సిసి రోడ్లు, సైడ్ కాలవలు ,రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రతి ఇంటికి మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు వార్డులో 210 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, ఇంకా 40 మంది దాకా కావాలన్నారని ప్రతి ఒక్కరికి పట్టా ఇచ్చి ఇల్లు నిర్మిస్తామని తెలిపారు. నిన్న చంద్రబాబు పవన్ కళ్యాణ్ కలిసి మీటింగ్ నిర్వహించారని వారు ఎప్పుడో కలిసి ఉన్నారని అన్నారు. 2014 ఎన్నికలలో 2019 ఎన్నికలలో కలిసే పోటీ చేశారని తెలిపారు.

కేవలం యాంటీ గవర్నమెంట్ ఓట్లు కోసం చంద్రబాబు పవన్ కళ్యాణ్ తో పొత్తు పెట్టుకున్నాడని అన్నారు. కాపు సోదరులకు జనసేన సోదరులకు ఒకటే చెబుతున్నాం చంద్రబాబు మాటలు నమ్మవద్దని జనసేన ఓట్లతో చంద్రబాబు లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. నిజంగా చంద్రబాబుకు సిద్ధ సిద్ధి ఉంటే సీఎం అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ని ప్రకటిస్తారని అన్నారు. కాపు సోదరులు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు .కాపులకు 3 లక్షల 50 మంది కాపు సోదరీమణులకు సంక్షేమ పథకం కాపు నేస్తం ద్వారా అందించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నామని అన్నారు. ప్రజాసంకల్పయాత్ర నేటికీ నాలుగు సంవత్సరాల అయిందని ఎంతోమంది కార్యకర్తలు నాయకులు ఆ పాదయాత్రలో పాల్గొన్నారు, వాళ్లందరూ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఏడవ వార్డు వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారానికే సచివాలయ వ్యవస్థ



కంచికచర్ల జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి:పట్ట ణం లోని 7 వ వార్డులో మంగళవారం ఉదయం గడపగడ పకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసన సభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు ప్రతి గడ పకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలు -లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడి గి తెలుసుకున్నారుఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజల సమస్యలు, ఫిర్యాదులు స్థానికంగానే సత్వరంగా పరిష్కరించేందుకే గ్రామ సచివాలయ వ్య వస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏ ర్పాటు చేశారని తెలిపారు, ప్రజల వద్దకే పరిపాలన అనే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అం దుబాటులో ఉంచేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థ ను రూపొందించారని, జగన్ మోహన్ రెడ్డి ప్రతి అధి కారిని- ప్రజాప్రతినిధులను ప్రతి ఇంటికి పంపించి ప థకాల అమలుపై సమస్యలు తెలుసుకోమని- మీ వ ద్దకు పంపించారని లబ్ధిదారులతో ఎమ్మెల్యే తెలిపా రుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వేమ సురేష్ బాబు, ఎం పీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి రమేష్, సొసైటీ అధ్యక్షులు కాలవ పెదబాబు, దాసరి రాము ,ఈవో రవికుమార్, మాడుగుల శంకర్, నారిశెట్టి శ్రీ నివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బియ్యపు మధుసూధన్ రెడ్డి తో సమావేశమైన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి



శ్రీకాళహస్తి. ప్రజాపాలన ప్రతినిధి : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ని శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో కలిసి, రాబోయే తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి చర్చించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్ రెడ్డి పట్టభద్రుల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత పది రోజులుగా మొదటివిడత ఎన్నికల ప్రచారం కొనసాగుతుందని, సంక్రాంతిలోపే ప్రచారం ముగించి, రెండో విడత ప్రచారాన్ని నెలాఖరులోగా ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ అభ్యర్థి ఎమ్మెల్యే కి తెలియజేయడం జరిగింది.

## ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



శ్రీకాళహస్తి ప్రజా పాలన ప్రతినిధి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరించడం జరిగింది




# పల్నాడు జిల్లాలో నిక్షయ మిత్ర పథకం కింద టిబి వ్యాధిగ్రస్తులకు పోషక ఆహార కిట్లను అందే విధంగా చర్యలు చేపట్టాలి: పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లో తేటి




పల్నాడు జిల్లా .నరసరావుపేట .జనవరి 10 (ప్రజా పాలన ప్రతినిధి.): జిల్లాలో ఈనెల మూడో వారం లో నిక్షయమిత్ర పథకం కింద టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో నేషనల్ టిబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం కింద ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభయాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన నిక్షయమిత్ర కార్యక్రమంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యాధిగ్రస్తునికి ఆరు నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందజేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని అందులో భాగంగా దాతలు నుండి, ఉద్యోగస్తుల నుండి సుమారుగా 24 లక్షల రూపాయలు సేకరించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఇంత మొత్తం నిధులు సేకరించిన జిల్లాగా పల్నాడు ఆవిర్భవించిందని తెలిపారు. ఒక్కొక్కరికి 700 రూపాయలతో ఆరు నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు . ప్రతి ఒక్క పౌష్టికాహార కిట్లలో వేరుశనగపప్పు కేజీ, కందిపప్పు కేజీ, గోధుమపిండి, రాగి పిండి, శనగలు అరకేజీ, బెల్లం అరకేజీ మరియు వంట నూనె బియ్యం వంటివి ఉంటాయన్నారు. వీటిని ఆయా శాఖల అనుబంధంతో ప్యాకేజీ చేసి పేషెంట్లకు అందజేసే విధంగా రవాణా సౌకర్యాలు కూడా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. ఈనెల మూడో వారంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీమతి విడుదల రజిని మరియు జలవనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు సమక్షంలో ఇట్లు అందజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. హెూల్సేల్ డీలర్లతో మాట్లాడి ముడి సరుకుల కొనుగోలు విషయంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీ నాటికి కిట్ల తయారీ పూర్తి కావాలన్నారు.

రాష్ట్ర జలవనుల శాఖ మాత్యులు శ్రీ అంబటి రాంబాబు 50 మందిని, పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు వందమందిని, నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 50 మందిని, శాసనసభ్యులు నంబూరు శంకర్రావు 50 మందిని, గురజాల శాసనసభ్యులు శ్రీ కాసు మహేష్ రెడ్డి 50 మందిని దత్తత తీసుకోవడం గొప్ప విషయం అన్నారు. అదేవిధంగా అసిస్ట్ ఇండియా, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్, జీకేఎస్ చారిటబుల్ ట్రస్ట్ వంటి చంద్ర సేవా సంస్థలు కూడా పలువురిని దత్తత తీసుకొని ముందుకు రావడం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభారాణి, జిల్లా టీబి అధికారి డాక్టర్ పద్మావతి, డిసిహెచ్ ఎస్ రంగారావు, డీఆర్డీఏ పిడి బాలు నాయక్, జిల్లా సప్లై అధికారి మోహన్ బాబు, డి ఎం సివిల్ సప్లై వరలక్ష్మి, ఏపీ ఎంఐడిసి అధికారి సిహెచ్ ఆంజనేయులు, మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే గ్రంధి

భీమవరం, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) : చిరు వ్యాపారులకు తమ ప్రభుత్వం అండగా ఉందని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిఆర్డిఏ పిడి ఎమ్ఎస్ ఎన్ వేణుగోపాల్ తో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిరు వ్యాపారుల ఖాతాల్లో వడ్డీ డబ్బులను జమ చేయనున్నారని పేర్కొన్నారు. భీమవరం నియోజవర్గంలో 5 వేల మంది చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించగా వారు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని నేడు తమ ప్రభుత్వం చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ జగనన్న తోడు పథకం వల్ల చిరు వ్యాపారులకు భీమవరం నియోజకవర్గంలో రూ.12 లక్షల మేర లబ్ధి జరుగుతుందని అన్నారు. సమాజంలో అన్నివర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని తమ కుటుంబాలను పోషించుకోవడానికి గాను వడ్డీకి అప్పులు తెచ్చి వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో సాయంత్రం అయ్యేసరికి వచ్చిన ఆదాయం వడ్డీ కట్టడానికే సరిపోతుందని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో గుర్తించారని అందుకే ఆయన ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే జగనన్న తోడు పథకాన్ని అమలు చేయడం ప్రారంభించారని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, కోమటి రాంబాబు, నామన మహేష్ లు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన సిటీ ఇంచార్జి అనుశ్రీ పుట్టినరోజు వేడుకలు



రాజమహేంద్రవరం : ప్రజాపాలన ప్రతినిధి:జనసేన రాజమహేంద్రవరం సిటీ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.పోస్టల్ కాలనీలోని ఆయన నివాసంలో ఉదయం సత్యనారాయణ దంపతులు శ్రీలక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు.అనంతరం జనసేన నాయకులు,జన సైనికులు, వీర మహిళల సమక్షంలో కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు అనుశ్రీ సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్,ఏడిద బాబి,విన్నా వాసు, ఫణి, ఠాగూర్, రాంబాబు, గెడ్డం నాగరాజు,ఎ.వి.డి.ప్రసాదరాజు,అల్లాటి రాజు,దాసరి గురునాధరావు, ఆసూరి సుధాకర్,పొన్నాడ శ్రీను,బాషా లిమ్రా,బాలు, వీరబాబు తదితరులు అనుశ్రీ సత్యనారాయణ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జనసేన నాయకుడు ఏడిద బాబి ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఉదయం బయపునీడి సూర్య ఆధ్వర్యంలో గౌతమి జీవకారుణ్య సంఘం వృద్ధులకు అల్పాహారం అందచేశారు.

## మానసిక ఉల్లాసం పొందాలనే ఫ్యామిలీ డే కార్యక్రమం: జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా



అమలాపురం జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి మానసిక ఉల్లాసం పొందడంతో పాటుగా ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పని సంస్కృతిని, పనిచేసే వాతావరణం తెలుసు కునేందుకు వీలుగా కార్పొరేట్ సంస్థల శైలిలో "ఫ్యామిలీ డే" నూతన ఒరవడికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శ్రీకారం చుట్టారు . మంగళవారం స్థానిక కలెక్టరేట్లో రెవెన్యూ ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులతో ఫ్యామిలీ డే ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ..ఫ్యామిలీ డే విధానం వల్ల ఉద్యోగులు ఒకరోజు కుటుంబ సభ్యులతో ఉద్యోగ విధులు నిర్వర్తిం చడం మూలంగా కుటుంబ సభ్యుల కు కూడా ఉద్యోగుల పని వాతావరణం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రతి నెల మూడో శనివారం ఫ్యామిలీ డే నిర్వహించాలనే యోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజల కోసం కొన్ని అత్యవసర సంద ర్భాలలో ఉద్యోగస్తులు సాయంత్రం పని వేళలు దాటిన తర్వాత కూడా పనిచేస్తున్నారనే విషయం కూడా కుటుంబ సభ్యులకు తెలుస్తుందని కలెక్టరేట్ విధులు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు తెలుసుకొనేందుకు మరియు పనిచేసే ప్రాంతం తెలుస్తుందని, అందరి కుటుంబ సభ్యులతో కలిసి ఆటలు క్రీడలు నిర్వహించడం మూలంగా ఎంతో ఉల్లాసంగా ఆనందంగా రోజంతా గడిచిందని తెలిపారు..ఈ క్రీడల నిర్వహణ వల్ల పోటీతత్వం, మానసిక ఉల్లాసం పొందడం జరుగుతుందన్నారు. ఉల్లాసవంతంగా ఆహ్లాదకర వాతా వరణంలో చదరంగం, క్యారమ్స్, బాస్కెట్బాల్,లెమన్ స్పూన్,వాలీబాల్ క్రికెట్ చిన్నపిల్లల ఆటల పోటీలు నిర్వహించారన్నారు. కలెక్టరేట్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ పివి రమణకుమారి తమ స్పందన తెలియజేస్తూ ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులను ఆహ్వానిస్తూ వారికి ఆటపాటలు పట్ల ఉన్న ఆసక్తిని సృజనాత్మకతను తెలుసుకు నేందుకు వీలుగా ఫ్యామిలీ డే కార్యక్రమాలు ఎంతగానో దోహ దపడతాయని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులు ఒకరి అభిప్రాయాలు మరొ కరు పంచుకునేందుకు వీలుగాను పని ఒత్తిడిని అధిగమించి మానసిక ఉల్లాసానికి పొందేందుకు ఈ ఫ్యామి లీ డే కార్యకలాపాలు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. వికాస జిల్లా మేనేజర్ రమేష్ తమ స్పందన తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ వారు గొప్ప నిర్ణయం తీసుకుని పని ఒత్తిడికి లోనవ్వకుండా ఆటపాటల నిర్వహణ విందు ఏర్పాట్లు ద్వారా ఉద్యోగుల కుటుంబ సభ్యులతో ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా రోజంతా ఉద్యోగ విధులు నిర్వహణతో పాటు ఆనందం వ్యక్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు,సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా అవగాహన కోసమే యన్.జి. ఓ సంస్థలకి మొదటి ప్రాధాన్యత నిచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ




పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 10 (ప్రజా పాలన ప్రతినిధి.): దేశవ్యాప్తంగా ఈనెల పదకుండు నుండి పదిహేడు వరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు కేంద్ర ప్రభుత్వం మినిస్టరీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ మరియూ హైవే రోడ్డు సేఫ్టీ విభాగం ప్రకటించారు. గతంలో కంటే భిన్నంగా ఈసారి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కలిపించటానికి యన్. జి. ఓ లకి మొదటి ప్రాధాన్యత నిచ్చారు. దీనిపై రోడ్డు సేఫ్టీ యన్. జి.ఓ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. కె దుర్గ పద్మజ మాట్లాడుతూ స్టేక్ హెూల్డర్స్ ప్రతి నిత్యం వారి వారి పనుల్లో బిజీగా ఉంటున్న కారణంగానే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారు యన్. జి. ఓ సంస్థలకి మొదటి ప్రాధాన్యత నిచ్చారు అని మా యన్. జిఓ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రీజినల్ వర్కింగ్ కమిటీ లు ఉన్నాయి అని మా యన్. జి. ఓ స్వచ్ఛంద ముగానే గత తొమ్మిది సంవత్సరాలు గా ఈ యొక్క రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వాహిస్తున్నాము అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం ఒక మహిళ గా నేను ప్రజల్లో చేస్తున్న రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు గుర్తించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పేర్ని వెంకట రామయ్య గారు మా యన్. జి. ఓ కి ప్రశంసపత్రం కూడా ఇచ్చారు అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ పై దృష్టి పెట్టి యన్. జి. ఓ లని భాగస్వామ్యం చేయాలి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం లో రోడ్డు భద్రతా కౌన్సిల్ లో యన్. జి. ఓ తరుపున మహిళ కి అవకాశం ఇవ్వాలని కోరారు. యన్ జి. ఓ లకి ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి ధన్యవాదాలు తెలిపారు.

## యువశక్తి ప్రచారంలో పాల్గొన్న నాయకర్



నరసాపురం, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) : జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యువశక్తి కార్యక్రమ ప్రచారంలో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర పిఏసి సభ్యుడు, నరసాపురం నియోజకవర్గ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ మంగళవారం పలువురు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వంతో జనసేన పార్టీ పోరాడుతుందని ఆయన భరోసా ఇచ్చారు. ఆ ప్రాంత ప్రజలకు, యువతకు జనసేన పార్టీ విధి విధానాలను నాయకర్ వివరించి వారికి యువశక్తి కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని తెలియజేశారు. ఈ పర్యటనలో నాయకర్ వెంట పలువురు జనసేన పార్టీ రాష్ట్ర నేతలు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డి.ఇ.వై.ఇ.ఓ సుభద్ర



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి :గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలోడి.ఇ.వై.ఇ.ఓ సుభద్ర మంగళవారం ప్రాథమిక జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆమె పిల్లలు పుస్తకాలను పరిశీలించారు ఉపాధ్యాయులు ఏవిధంగా విద్యను బోధిస్తున్నారు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అనంతరం వంటశాలను నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు అందరూ 100% ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులందరూ ఎప్పటినుంచి కృషి చేయాలని ఆమె అన్నారు ప్రధానోపాధ్యాయురాలు పి. నాగమణి, పాఠశాల సహాయ ప్రధానోపాధ్యాయుడు జి. వెంకటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయుడు, ఏ. సత్యనారాయణ , సోషల్ మాస్టర్ మహేష్, పిఈటి సత్యనారాయణ తదితరులు

## పాడి రైతులకు ప్రోత్సహకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



శ్రీకాళహస్తి ప్రజాపాల ప్రతినిధి :శ్రీకాళహస్తి కోపరేటివ్ పాల సొసైటీ పరిధిలోని పాడి రైతులకు శ్రీకాళహస్తి పట్నంలోని మార్కెట్ యార్డ్ నందు పాడి రైతులకు ప్రోత్సాహకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి రైతులకు పాల సొసైటీ తరఫున బహుమతులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,తిరుమల తిరుపతి దేవస్థానం మరియు ప్రముఖ దేవస్థానాలు నందు శ్రీకాళహస్తి పాలకోవా స్టాల్స్ ను ఏర్పాటు చేసి శ్రీకాళహస్తి పాల కోవా కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొని వచ్చే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు.ఈ వచ్చిన ఆదాయంతో పాడి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా కృషిచేసి రైతులకు లబ్ధి చేకూరుస్తామని తద్వారా రైతులకు పాల సొసైటీ తరపున పాడి ఆవులు తీసుకోవడానికి లోన్లు అందజేసే విధంగా కృషి చేస్తామని అన్నారు.పాడి రైతుల కోసమే అమూల్య కంపెనీని రాష్ట్రానికి సీఎం జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చి రైతు కష్టానికి న్యాయం చేకూరుస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల సొసైటీ చైర్మన్ %వీ%.మధుసూదన్ మరియు సభ్యులు హరినాథ్ రెడ్డి, మంగమ్మ,రామయ్య, రామ్మూర్తి, మునికృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,రమణి అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి,మోహన్ నాయుడు, కందటి ఈశ్వర్ రెడ్డి,భక్తవత్సలం నాయుడు,వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి,చింతామణి పాండు, మున్రామయ్య,శంకర్ రెడ్డి, పటాన్ ఫరీద్,గంగి రెడ్డి,పసల కృష్ణయ్య, ఈగల హరి రాయల్ మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## 280 మందికి కోవిడ్ నష్టపరిహారం: జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు



అమలాపురం జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గల కోవిడ్ మూలంగా చనిపోయిన 280 మందికి నష్టపరిహారం అందిస్తున్నట్లు స్థానిక జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి తెలిపారు. కోవిడ్ వైరస్ మూలంగా చనిపోయిన వారికి ప్రభుత్వం ప్రకటించిన 50 వేల రూపాయలు నష్టపరిహారాలను అందించేందుకు జీవో ద్వారా కోటి 60 లక్షలు విడుదల చేసిందని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 370 మంది కోవిడ్ మూలంగా చనిపోయిన నష్టప రిహారాల కొరకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందనిఆయన తెలిపారు. వీరిలో 280 మందికి నష్టపరి హారాలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహణ కొరకు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఈనెల 12వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## మార్చి ఒకటి నాటికి టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేస్తాం: నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా .నరసరావుపేట .జనవరి 10 (ప్రజా పాలన ప్రతినిధి): మార్చి ఒకటవ తారీఖు నాటికి టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం చిలకలూరిపేట రోడ్ లోని చిట్కో గృహ సముదాయాన్ని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, ఎలక్ట్రిసిటీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం బిల్డింగుల వరకే పూర్తి చేసి వెళ్లారని, తరువాత అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు .10 కోట్ల రూపాయలతో అన్ని పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. 1504 గృహాలు పూర్తయినయని అన్నారు. ఆరు కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ,మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని, నాలుగు కోట్ల రూపాయలతో ఎలక్ట్రిసిటీ ఏర్పాటు చేశామని అన్నారు, మొత్తం గృహం విలువ 7,65,000 అని ప్రభుత్వం వారు కొంత, లబ్ధిదారుడు బ్యాంకు ద్వారా 3 లక్షల 15 వేల రూపాయలు లోన్ తీసుకొని కట్టాలని అన్నారు. పూర్తిగా డెవలప్మెంట్ చేస్తున్నామని అన్నారు. చిలకలూరిపేట రోడ్డు నుండి ఈ గృహాల వరకు సిసి రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు ఏ ఇబ్బంది లేకుండా మంచినీటి సౌకర్యం గాని కరెంటు విషయంలో రాజీ లేకుండా పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. గృహాలు పక్కన ఉన్న డబ్బింగ్ కూడా వేగవంతంగా తీసివేసి అక్కడ శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు 450 రూపాయలు డిపాజిట్ కట్టి కరెంటు కరెంటు మీటర్ ను తీసుకోవాలని తెలిపారు .లబ్ధిదారుడు లోను తీసుకునే అవసరం ఉంటే లోను తీసుకోవాలని లేకుంటే సొంతగా డబ్బులు కట్టుకోవచ్చని తెలిపారు. జనవరి నెలకల్లా మున్సిపల్ అధికారులతో మాట్లాడి స్పష్టమైన సమాచారం తీసుకొని బ్యాంకుల దగ్గర వెళ్లి లోను తీసుకోవాలని తెలిపారు. ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వం వారు రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్ అండ్ బి అధికారులు ఎలక్ట్రిసిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయినవిల్లి జూనియర్ కళాశాలలో ఆటల పోటీలను ప్రారంభించిన జడ్పిటిసి గన్నవరపు



అయినవిల్లి జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం అయినవిల్లి శ్రీ నరహరశెట్టి వెంకట్రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈరోజు స్థానిక మండల జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు,చే వాలీబాల్, రంగవల్లి, మరియు కబాడీ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ఒకటి రెండు మూడు బహుమతులుగా అందించారు. 1వ బహుమతి 2వ బహుమతి 3వ బహుమతులు ను విద్యార్థినీ విద్యార్థులకు ఇచ్చి వారిని అభినందించారు. ఈ కార్యక్రమమునకు సభాధ్యక్షులు డి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ ముఖ్య అతిథులు అమలాపురం ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి వెంకటేశ్వరరావు అయినవిల్లి జెడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు , ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి వెంకటరమణ, మాజీ సరసర్పంచులు: మద్ది%శీ%శెట్టి రాంబాబు, అడ్డాల రాంబాబు, కొచ్చర్లపాటి రామకృష్ణంరాజు, ముద్రగడ బాబ్జి, సొసైటీ మాజీ చైర్మన్ కొత్త కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ హేబెల్ ఇతర ఉపాధ్యాయ బృందం కళాశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇదేమి కర్మ మన రాష్ట్రానికి ... అధిక ధరలు: జీవి ఆంజనేయులు




పల్నాడు జిల్లా వినుకొండ. జనవరి 10. (ప్రజా పాలన ప్రతినిధి )"ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి"టీడీపీ అధినేత,మాజీ ముఖ్య మంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత,నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు సోమవారం నాడు "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని పట్టణ టిడిపి అధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని 13 వార్డులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు వినుకొండ మాజీ శాసనసభ్యులు జీ.వీ.ఆంజనేయులు . ఈ సందర్భంగా జి.వి.ఆంజనేయులు ఇంటింటికి వెళ్లి గత మూడున్నర ఏళ్లుగా జగన్ రెడ్డి హయాంలో తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రం ద్వారా ప్రజల నుండి లిఖిత పూర్వకముగా తీసుకున్న తర్వాత వారి మొబైల్ నెంబర్ నుండి మాతో కలిసి పోరాడేందుకు "9261292612" నెంబర్ కి మిస్డ్ కాల్ ఇచ్చి ఈ వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు నిరసన తెలియజేయడం జరిగింది., ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలు దేశవ్యాప్తంగా తీసుకువెళ్లిబోతున్నామని ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అవనిగడ్డ నియోజకవర్గం సంక్షేమ పథకాలు అమలులో సీఎం జగన్ దేశానికే ఆదర్శనీయం: ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



ప్రజా పాలన కృష్ణాజిల్లా :అవనిగడ్డ గ్రామ సచివాలయం-5 పరిధిలో కొత్తపేట, తీపాలెంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శ నీయమన్నారు. అందుకే మంత్రులు, ఎమ్మెల్యేలను నిత్యం ప్రజల మధ్యనే ఉండమంటున్నారని ఎమ్మెల్యే చెప్పారు. మంచి జరిగితేనే ఆదరించమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్తున్నారని ఇలా దమ్ముగా చెప్పిన సీఎం గతంలో ఎవరూ లేరని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. లిఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్ బాబు గారు,ప్రజా ప్రతినిధులు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్,వైసీపీ నాయకులు,కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు..

# జగన్ పాలనలో రాష్ట్రం దివాళా



నరసాపురం, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పరిపాలనను ప్రజలకు వివరిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని 37వ బూత్ పరిధిలోని 22వ వార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను ఆరా తీసి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సమస్యలపై పోరాటంలో తెలుగుదేశం పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం పొత్తూరి రామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గత మూడున్నర ఏళ్లగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని నిత్యవసర ధరలు, విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులు, ఇసుక, మద్యం ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. అప్పులతో పరిపాలన సాగిస్తూ రాష్ట్రం దివాలా తీసే పరిస్థితికి తీసుకొచ్చారని అప్పుతెచ్చి పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, పార్టీ నాయకులు గేదెల రామారావు భోగిరెడ్డి ముత్యం, దొంగ పద్మారావు, ఉల్లంపర్తి సత్యనారాయణ, కొలచన శ్రీపద్మ తిరుమాని శశిదేవి, జక్కం దుర్గానాగేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# పోలీసుల అదుపులో కావలి..



కావలి జనవరి 10 (ప్రజాపాలన) :చలో కావలి కార్యక్రమాన్ని కి పర్మిషన్ లేనందునటీడీపీ నాయకులుకు నోటీసులును పోలీసులు అందజేశారు.సభలకు, ర్యాలీలు కు అనుమతి లేనందున నోటీసులు జారీ చేస్తున్నామని సంబందిత అధికారులు తెలిపారు. తెల్లవారుజామున నుండి పోలీసులు పహారా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ 10 వ తేదీ న చలో కావలి కార్యక్రమాన్నీ కి పర్మిషన్ ఇవ్వకుండా జీవో ల పేరుతోకావలి లో ప్రధాన కూడలి లో పోలీసులు బందోబస్తు నిర్వహించడం సిగ్గుచేటు అని అన్నారు. ఇది వైసీపీ ప్రభుత్వం అసమర్థత అని అన్నారు. మంగళవారం "చలో కావలి" కార్యక్రమం చేస్తున్నామని దళిత నాయకులును ముందస్తుగా పోలీసులు నోటీసులు ఇచ్చి చలో కావలి కార్యక్రమాన్ని జరకుండా భారీగా అన్ని సెంటర్లలో పోలీసులను ఏర్పాటు చేయడం దుర్మార్గపు చర్య అని ఎద్దవచేశారు. నియోజకవర్గ లో ముగ్గురు దళితులు కు అన్యాయం జరిగిందని వారి కుటుంబాలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉందని దళిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. దళిత కుటుంబాలకు అన్యాయం చేసినా వారిపై చర్యలు తీసుకోలేదని అందుకే చలో కావలి కార్యక్రమానికి పిలుపునిస్తే దాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ను అడ్డుపెట్టికొని కావలి చుట్టుపక్కల ప్రాంతంలో ప్రధాన కూడలిలో పోలీసులు తో అన్ని దారులను దిగ్బంధం చేయడం ఏమిటని ప్రశ్నించారు.కావలి తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు ఎటువైపు నుంచి వచ్చి "చలో కావలి" కార్యక్రమం ని విజయవంత చేస్తారని ఎక్కడికక్కడ మా నాయకులను అరెస్ట్ లు చేశారని తెలిపారు. దళిత నాయకులు ఏవిధంగానైనా పోలీసులను ప్రతిఘటించి "చలో కావలి" కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని, దళిత నాయకుల ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏంటని పట్టణ ప్రజల్లో సర్వత్ర చర్చ కొనసాగుతుందని పురం గుసగుసలు వినిపిస్తున్నాయి..? ఎట్టకేలకు బుడంగుంట ఎస్ సి కాలనీ లో నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి నాయకులు తో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందచేశారు.హుటాహుటిన పోలీసులు అక్కడికి చేరుకొని మాలేపాటి సుబ్బానాయుడు ని అరెస్ట్ చేసి జలదంకి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ కార్యక్రమంలో దళిత టీడీపీ నాయకులు జ్యోతి బాబురావు, కాకి ప్రసాద్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర పేపర్ మిల్ కార్మికుల భవిష్యత్తుకై మా పోరాటం



రాజమహేంద్రవరం : ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్ర పేపర్ మిల్ కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పరంపర టూ ను రద్దు చేయాలని యాజమాన్యం మొండి వైఖరి నశించాలని కోరుతూ 8 కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఈ నెల రోజులపాటు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు యూనియన్ కార్మిక సంఘాలు ప్రకటించాయి . ఈరోజు సాయంత్రం యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరుగుతుంది రేపటినుండి రిలే దీక్షలు 14 రోజులుజరుగుతాయి. 14న భోగిమంటలలో యాజమాన్యం ఇచ్చిన పరంపర టు జీవోను దగ్ధం చేయడం జరుగుతుంది. 13న అన్ని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడుతుంది 15న పేపర్ మిల్లు వద్ద కార్మికులతో మనవహారం జరుగుతుంది 18న పేపర్ మిల్ గేటు వద్ద జనరల్ బాడీ జరుగుతుంది. 20న నగరంలో అన్ని పార్టీలు కార్మిక సంఘాలతో భారీ ర్యాలీ జరుగుతుంది. 23న రాజమండ్రి బందు జరుగుతుంది. 24న తర్వాత ఎప్పుడైనా కార్మికుల సమ్మె జరుగుతుంది.

## బండారు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



నరసాపురం, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :ఈనెల11వ తేదీ బుధవారం నరసాపురం మాజీ శాసనసభ్యుడు బండారు మాధవనాయుడు పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకుని లక్ష్మణేశ్వరం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పాలకొల్లు పట్టణంలోని అన్న క్యాంటీనులో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు ముఖ్య అతిధులుగా పాల్గొని బండారు మాధవ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చాగంటి సురేష్, గన్నవరపు శ్రీనివాస్, నడిపూడి కృష్ణ, అడిదెల దానియేలు, చాగంటి ఆనంద్, భారీ సంఖ్యలో మాధవనాయుడు అభిమానులు పాల్గొన్నారు.

## ములకలూరులో చర్చి ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా . నరసరావుపేట. జనవరి 10 (ప్రజా పాలన ప్రతినిధి.): మండలంలోని ములకలూరు గ్రామంలో చర్చి ప్రతిష్ట మహోత్సవంలో నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాన్ రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం చర్చి ప్రతిష్ట లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపుల కొరకు తన ప్రాణాన్ని ఇచ్చారని అన్నారు ప్రతి ఒక్కళ్ళు మంచి మనసుతో క్రిస్టియను ప్రార్థించాలని అన్నారు. చర్చి పాస్టర్ పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు , జెడ్పిటిసి చిట్టిబాబు ,మురె రవీంద్రారెడ్డి ,కనకం పుల్లారెడ్డి ,వంపుగుడీ జాన్ , మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మాతృ మరణాల సమీక్ష సమావేశం



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 10 (ప్రజా పాలన ప్రతినిధి.): 10. 1. 2023 న మధ్యాహ్నం 3 గంటలకు మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగముగా మాతృ మరణాలపై సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మాతృ మరణాలు సమీక్ష సమావేశ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గారి చాంబర్ నందు డాక్టర్ జి శోభారాణి గారి ఆధ్వర్యంలో జరిగినది. సదరు కార్యక్రమంలో డిసెంబర్ నెలలో జరిగిన రెండు మాతృ మరణాల యొక్క కారణములను మాతృ మరణం జరిగిన ప్రైవేటు మరియు ప్రభుత్వ వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి జాగ్రత్తలు తీసుకొని మాతృ మరణములను జరగకుండా చూడవలసిందిగా ఆదేశించినారు. సదరు కార్యక్రమమునకు డాక్టర్ బి వి రంగారావు,%ణజ్ఞూ%, డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, డాక్టర్ గీతాంజలి, %ణ×ూ%, డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ నాగ పద్మజ, డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ సింధుజ, డాక్టర్ రాజేష్, డాక్టర్ కృష్ణ కుమార్,మరియు కమిటీ మెంబెర్స్, పారా మెడికల్ సిబ్బంది సిబ్బంది, మరియు సి డి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైదాపల్లి పున్నమ్మ మృతదేహానికి నివాళులర్పించిన జె కె స్టీల్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు



శ్రీకాళహస్తి - ప్రజాపాలనప్రతినిది :శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని చల్లపాళ్యం గ్రామానికి చెందిన సైదాపల్లి పున్నమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన జేకే స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు పున్నమ్మ పార్థీవ దేహానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. అలాగే మృతురాలు పున్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బైజుస్ ఒప్పందాన్ని పునః పరిశీలించాలి: ఎపిటిఎఫ్ (1938) డిమాండ్




గుంటూరు: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థ బైజుస్ కి విద్యారంగాన్ని అప్పగిస్తూ చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పున పరిశీలించాలని ఎపిటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు గోవిందు వెళాంగణిరాజు, మేకల సుబ్బారావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా ఆఫీస్ బ్యారర్స్ సమావేశం ఈరోజు గుంటూరు ఎపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యుల సమావేశం జరిగింది.. ఈ సందర్భంగా ప్రదాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం టెక్నాలజీ కాదని, టెక్నాలజీ బోధనకు సహాయకారిగానే ఉంటుందని తెలిపారు. ఇంతవరకు విద్యాబాధనలో ప్రావీణ్యం లేని బైజ్యూస్ ట్యూషన్ సెంటర్స్ మాత్రమే నడిపే సంస్థకి రాష్ట్ర విద్యారంగంలో బోధన చేయించడానికి ఎపిటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. బైజూస్ ఇచ్చిన ట్యాబ్లలో ఉన్న కంటెంట్ ఉపాధ్యాయులు చెప్పే కంటెంట్ తేడా వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. బైజుస్ వారు చెప్పే విద్యా విధానం నాణ్యమైనది ఆయినదని ఎలా అంచనాకు వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నరసింహారావు డిమాండ్ చేశారు. అప్పులతో నడిచే బై జూస్ కి పాఠాలు ఇవ్వటం ఎంతవరకు సమంజసం అని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్ ప్రశ్నించారు. ఇప్పటికీ ఉపాధ్యాయులు పాఠాలు చెబితే టాబుల్లో చూడటం గా ఉంటే, భవిష్యత్తులో ట్యాబుల్లో చెప్పిన పాఠాలకు ఉపాధ్యాయులు అనుమానాలు తీర్చే వారిగా మిగిలిపోతారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బైజూస్ ఒప్పందాన్ని పరిశీలించాలని కోరారు. ఎపిటిఎఫ్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి నాగమల్లేశ్వరరావు,జోజప్ప మాట్లాడుతూ యన్.సి ఆర్.టి. ఎస్సీ ఆర్టీవారు రూపొందించిన గణితం అత్యంత ప్రామాణికంగా ఉందని నిరూపించబడిందని, అయినా ఎన్సీఈఆర్టీ పేరుతో సిబిఎస్ఈ సిలబస్ ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సీబీఎస్ సీఈలో ఉన్న ప్రయోగ పద్ధతి, సృజనాత్మక అంశాలను ఎస్సీఆర్టీ తీసుకుని మన రాష్ట్ర సిలబస్ నే కొనసాగించాలని కోరారు. సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ అమలు చేయాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డి డి ఓ పవర్స్ ఇచ్చి పాత బకాయిలు వెంటనే చెల్లించాలని తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎమ్.వి. ప్రసాద,సహా అధ్యక్షులు పి.రమేష్ , అదనపు కార్యదర్శి మోపిదేవి శివశంకర రావు, కార్యదర్శులు , ఓ.నాగార్జున, గణేష్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




# ట్రోలర్స్ కి కిరణ్ అబ్బవరం స్మార్ట్ రిప్లై!



కిరణ్ అబ్బవరం.. 2019లో రవికిరణ్ కోల రూపొందించిన రొమాంటిక్ డ్రామా 'రాజా వారు రాణీగారు' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఈ మూవీ ఫరవాలేదనిపించింది. ఆ తరువాత శ్రీధర్ గాదె డైరెక్షన్ లో చేసిన 'ఎస్.ఆర్. కల్యాణ మండపం' కిరణ్ అబ్బవరంకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టింది. ఇందులో కిరణ్ అబ్బవరం హీరోగా నటించడమే కాకుండా స్టోరీ స్క్రీన్ ప్లేని అందించి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ మూవీకి చేతన్ భరద్వాజ్ అందించిన ఆడియో యూట్యూబ్ లో వైరల్ గా మారి ట్రెండ్ అయింది. అయితే ఈ మూవీ తరువాత కిరణ్ అబ్బవరం నటించి మూడు సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్ అయి షాకిచ్చాయి. బాలాజీ సయ్యపు రెడ్డితో చేసిన 'సెబాస్టియన్ పీసీ 524' గోపీనథ్ రెడ్డితో చేసిన 'సమ్మతమే' ..'ఎస్.ఆర్. కల్యాణ మండపం' వంటి హిట్ ని అందించిన శ్రీధర్ గాదెతో చేసిన 'నేను మీకు బాగా కావాలసిన వాడిని' మూవీ కూడా కిరణ్ అబ్బవరంకు చేదు అనుభవాన్ని చవిచూపించింది. దీంతో మళ్లీ హిట్టు కోసం కిరణ్ అబ్బవరం ఆశగా ఎదురు చూస్తున్నాడు. అతని ఆశలన్నీ ప్రస్తుతం గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ పై బన్నీ వాసు నిర్మిస్తున్న 'వినరోభాగ్యము విష్ణుకథ'పైనే వున్నాయి. వరుస ఫ్లాపుల్లో వున్నా కిరణ్ అబ్బవరం డైరీ మాత్రం ఖాళీగా మాత్రం లేదు. 'వినరోభాగ్యము విష్ణుకథ'తో పాటు కిరణ్ అబ్బవరం మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాడు. అందులో ఒకటి 'మీటర్'. ఈ మూవీని క్లాప్ ఎంటర్ టైన్ మెంట్ తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్నారు. ఇక మరో మూవీ 'రూల్స్ రంజన్'. ఏ.ఎం. రత్నం సమర్పణలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ మూడు సినిమాలు బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ కు రెడీ అవుతున్నాయి. మంగళవారం రిలీజ్ చేసిన 'వినరో భాగ్యము విష్ణుకథ' టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. హీరోగా రైటర్గా స్క్రీన్ ప్లే రైటర్ గా తన టాలెంట్ ని చూపిస్తున్న కిరణ్ అబ్బవరంపై నెట్టింట ఓ నెటిజన్ చేసిన ట్వీట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. దీనిపై కిరణ్ అబ్బ వరం చాలా స్మార్ట్ గా స్పందించి ట్రోలర్స్ కి స్ట్రాంగ్ రిప్లై ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ నెటిజన్ 'వాల్తేరు వీరయ్య' ఈవెంట్ లో చిరు రవితేజ స్టేజ్ పై మాట్లాడు తున్న ఓ వీడియోని సోషల్ మీడియా లో పోస్ట్ చేశాడు. చిరంజీవి రవితేజ తామిద్దరమే ఇండస్ట్రీలో ఎలాంటి గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తున్నా మని చెప్పిన విషయం తెలిసిందే. ఇదే వీడియోకు చిరు కు కిరణ్ తల ని రవితేజకు ఆది సాయి కుమార్ తలని అంటించి మీమ్ చేయడంతో కిరణ్ అబ్బవరం హర్ట్ అయ్యాడు. అలా చేసిన నెటిజన్ కు వెంటనే తనదైన స్టైల్లో స్ట్రాంగ్ రిప్లై ఇచ్చాడు. 'బ్రదర్ నా 3 ఏళ్ల కెరీర్ లో 5 సినిమాలు మాత్రమే చేశాను. నాకు తెలియకుండా విడుదలైన ఇతర సినిమాలు మీకు తెలిస్తే దయచేసి నాకు తెలియజేయండి' అంటూ రిప్లై ఇచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది.

## పవన్ 'కోహినూర్' దొంగ.. వీరమల్లు సీన్స్ అదుర్స్..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న సినిమా హరి హర వీరమల్లు. ఈ సినిమాను ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్నారు. సినిమాలో పవన్ కళ్యాణ్ ఒక బందిపోటు దొంగ గా కనిపిస్తారని టాక్. ఇక ఈ సినిమా కథ 17వ శతాబ్దం ఔరంగజేబు సామ్రాజ్యం నాటి నేపథ్యంతో వస్తుంది. సినిమాలో పవన్ ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా లుక్స్ యాక్షన్ తో కనిపిస్తారని తెలుస్తుంది.ఇక సినిమాలో పవన్ దొంగ గా కోహినూర్ వజ్రాన్ని దొంగిలిస్తారట. ఔరంగజేబు సామ్రాజ్యంలో ఉన్న కోహినూర్ ను పథకం ప్రకారం వీరమల్లు తన సొంతం చేసుకుంటారట. ఈ సీన్స్ సినిమాలో చాలా స్పెషల్ గా సినిమాకు హైలెట్ గా ఉంటాయని తెలుస్తుంది. క్రిష్ ఈ సినిమాను చాలా ఫోకస్ తో తెరకెక్కిస్తున్నారు. పవన్ కెరీర్ లో డిఫరెంట్ మూవీగా హరి హర వీరమల్లు సినిమా వస్తుంది.సినిమా అంతా ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతి అందిస్తుందని అంటున్నారు. ప్రేక్షకులకు కావాల్సిన వినోదం తో పాటుగా 17వ శతాబ్దం నాటి కథను కూడా క్రిష్ ఈ సినిమాతో చెప్పబోతున్నారు. సినిమాలో హీరోయిన్స్ గా నిధి అగర్వాల్ జాక్వెలిన్ నటిస్తున్నారు. బాలీవుడ్ హీరోయిన్ నోరా ఫతేహి కూడా ఈ సినిమాలో స్పెషల్ రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది.పవన్ ఈ సినిమా మీద పూర్తి నమ్మకంతో ఉన్నాడని తెలుస్తుంది. నిర్మాత ఏ.ఎం రత్నం కూడా సినిమాను ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెడుతున్నారు. పవన్ హరి హర వీరమల్లు సినిమా పాన్ ఇండియా మూవీగా వస్తుంది. సినిమా తప్పకుండా ప్రేక్షకుల అంచనాలకు తగినట్టుగానే ఉంటుందని చెప్పొచ్చు. సినిమాలో ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ నటిస్తున్నారు.

## అయ్యో రష్మిక ఎంత పని జరిగింది..!




సౌత్ సినిమాలు తీసే టైం లోనే ఆమెని నేషనల్ క్రష్ అన్నారు. ఇక బాలీవుడ్ ఛాన్స్ లు అందుకుంటున్న టైం లో ఆమె పేరు మారుమ్రోగింది. తీరా అక్కడ సినిమాలు చేస్తున్న టైం లో మాత్రం ఆమెకు బ్యాడ్ టైం స్టార్ట్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే నేషనల్ క్రష్ అనగానే అందరికి అర్థమయ్యే ఉంటుంది ఆ అమ్మడు ఎవరో కాదు రష్మిక మందన్న. అమ్మడు చేస్తున్న సినిమాలు ఆడియన్స్ ను సూపర్ గా ఎంటర్టైన్ చేస్తున్నాయి. తెలుగు తమిళ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న రష్మికకు బాలీవుడ్ నుంచి అవకాశాలు మొదలయ్యాయి.ఎంత సౌత్ స్టార్డం తెచ్చుకున్నా బాలీవుడ్ అంటే కథానాయికలకు ఒక మోజు ఉంటుంది. ఈ క్రమంలో హిందీ సినిమా ఛాన్సులు రాగానే రష్మిక కూడా ఎగిరి గంతేసింది. మొదటి సినిమా అమితాబ్ తో చేసిన గుడ్ బై నిరాశపరచగా త్వరలో మిషన్ మజ్ను సినిమా కూడా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. 1970 ఇండో పాక్ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటించిన రష్మిక ఈ సినిమాలో కూడా పాకిస్తాన్ అమ్మాయిగా నటించింది.సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేస్తారని అనుకోగా డైరెక్ట్ ఓటీటీ కి రిలీజ్ లాక్ చేశారు. రష్మిక బాలీవుడ్ ఆశలపై ఈ రెండు సినిమాలు దాదాపు నీళ్లు చల్లేశాయని చెప్పొచ్చు. బాలీవుడ్ లో తన టాలెంట్ తో అదరగొట్టేద్దామని అనుకున్న రష్మికకు మొదటి రెండు సినిమాలే పెద్ద షాక్ ఇచ్చాయి. మరోపక్క తెలుగు తమిళ భాషల్లో కూడా పెద్దగా అవకాశాలు లేవు.

## నీకేమో అందం ఎక్కువ.. శ్రీదేవి వెంట పడుతున్న వాల్తేరు వీరయ్య




మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటి వరకు ఈ సినిమా నుండి నాలుగు పాటలు వచ్చాయి. నాలుగు పాటలు కూడా మెగా ఫ్యాన్స్ తో పాటు మాస్ ఆడియన్స్ ను ఆకట్టుకుంది. ప్రతి పాట కూడా మాస్ ఆడియన్స్ ను కూర్చో నివ్వకుండా చేస్తున్న విషయం తెల్సిందే.బాస్ పార్టీ... శ్రీదేవి ఐతే నేను చిరంజీవి పాట ఇలా ప్రతి పాట కూడా ఆహా అనిపించే విధంగా ఉంది. ఇప్పుడు ఈ సినిమా నుండి ఐదవ సాంగ్ నీకేమో అందం ఎక్కువ అంటూ రాబోతుంది. చిరంజీవి మరియు శృతి హాసన్ కాంబోలో ఈ పాట ఉంటుందని పోస్టర్ ను చూస్తే అర్థం అవుతుంది. శృతి హాసన్ ను టీజ్ చేస్తూ సాగే ఈ పాట కు దేవి శ్రీ ప్రసాద్ తనదైన మార్క్ సంగీతాన్ని ఇచ్చాడంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు.ఈనెల 11వ తారీకున హైదరాబాద్ లోని మల్లారెడ్డి యూనివర్శిటీలో ఈ పాటను విడుదల చేయబోతున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అంటూ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ పాట విడుదల తర్వాత సినిమాపై ఆసక్తి మరింతగా పెరిగే అవకాశం ఉంది.సంక్రాంతి కానుకగా జనవరి 13వ తారీకున విడుదల కాబోతున్న వాల్తేరు వీరయ్య సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి అంచనాలకు తగ్గట్లుగా మాస్ మసాలా ఎలిమెంట్స్ తో ఈ సినిమాను దర్శకుడు బాబీ తెరకెక్కించాడని ట్రైలర్ చూస్తూ ఉంటే అర్థం అవుతుంది. మైత్రి మూవీ మేకర్స్ వారు ఈ సినిమాకు కాస్త ఎక్కువగానే ఖర్చు చేసినట్లుగా సమాచారం అందుతోంది.ఇక సంక్రాంతికి మెగా ఫ్యాన్స్ కు పండుగ రెట్టింపు చేసే విధంగా సినిమా ఉంటుందని యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా చెబుతున్నారు. రవితేజ.. ప్రకాష్ రాజ్.. శృతి హాసన్.. కేథరిన్ తెర్సా తో పాటు ఇంకా ఎంతో మంది ప్రముఖ నటీ నటులు ఈ సినిమా లో కనిపించబోతున్నారు. ఒక విభిన్నమైన మాస్ మసాలా సినిమాగా ఈ సినిమా ఉండబోతుంది.

## రామ్ చరణ్ టీమ్ కు కూడా అవే ఎదురు చూపులు..!



ఆ మధ్య మహేష్ బాబు.. త్రివిక్రమ్ సినిమా షూటింగ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు హీరోయిన్ పూజా హెగ్డే అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేసినట్లుగా వార్తలు వచ్చాయి. కొన్ని రోజుల తర్వాత పూజా హెగ్డే అందుబాటులోకి వచ్చిన తర్వాత మహేష్ బాబు మరియు త్రివిక్రమ్ యొక్క సినిమా షూటింగ్ పునః ప్రారంభం అయిన విషయం తెల్సిందే.హీరోయిన్స్ రెండు మూడు సినిమాలు ఒకేసారి చేస్తూ ఉండటం వల్ల డేట్ల విషయంలో అప్పుడప్పుడు ఇలాంటి సమస్యలు వస్తూ ఉంటాయి. ఇప్పుడు రామ్ చరణ్.. శంకర్ కాంబో సినిమాకు కూడా హీరోయిన్ వల్ల సమస్య తప్పలేదు. ఇండస్ట్రీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం రామ్ చరణ్.. శంకర్ సినిమా హీరోయిన్ కియారా అద్వానీ కారణంగా తాజా షెడ్యూల్ క్యాన్సిల్ అయ్యిందట.కియారా అద్వానీ గతంలో ఇచ్చిన డేట్స్ లో శంకర్ సన్నివేశాలు ముగించలేక పోయాడట. దాంతో ఇప్పుడు ఆమె కొత్తగా డేట్లు ఇచ్చేందుకు ఇబ్బందిగా ఉందట. ప్రస్తుతం హిందీలో ఆమె వరుసగా సినిమాలు చేస్తున్న కారణంగా రామ్ చరణ్ మరియు శంకర్ లు వెయిట్ చేయాల్సి వచ్చింది అంటూ మీడియా సర్కిల్స్ ద్వారా సమాచారం అందుతోంది.రామ్ చరణ్ మరియు శంకర్ కాంబోలో రూపొందుతున్న సినిమా యొక్క చిత్రీకరణ ఈ సమ్మర్ వరకు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమాను ఇదే ఏడాది దసరా లేదా దీపావళి సందర్భంగా విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారట. కియారా అద్వానీ యొక్క డేట్లు ఈ నెల చివరి నుండి లేదా ఫిబ్రవరి నుండి అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అప్పుడు షూటింగ్ షురూ అయ్యే అవకాశం ఉందని సమాచారం అందుతోంది.

## మన జక్కన్న మరో అమెరికన్ ఘనత సాధించాడోచ్




టాలీవుడ్ జక్కన్న రాజమౌళి బాహుబలి సినిమాతో దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్నాడు. ఇక ఆర్ఆర్ఆర్ సినిమాతో ఏకంగా ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాల్లో జక్కన్న గురించి తెలిసింది. ఒక తెలుగు సినిమా దర్శకుడు ఈ స్థాయి ఘనత దక్కించుకోవడం బాలీవుడ్ దర్శక నిర్మాతలకు కూడా ఆశ్చర్యంగా ఉండి ఉంటుంది.ఆస్కార్ ముందు ఉన్న టాలీవుడ్ జక్కన్న పలు అరుదైన రికార్డులను.. గౌరవాన్ని సొంతం చేసుకుంటున్నారు. ఆస్కార్ అవార్డ్ వచ్చినా రాకున్నా... ఆస్కార్ నామినేషన్స్ ను దక్కించుకోకున్నా కూడా జక్కన్నకు మరియు ఇతర ఆర్ఆర్ఆర్ సినిమా యూనిట్ సభ్యులకు దక్కుతున్న గౌరవం ఏ ఇండియన్ సినిమాలకు మరియు ఫిల్మ్ మేకర్స్ కు దక్కలేదు.తాజాగా రాజమౌళి అమెరికన్ అత్యంత ప్రతిష్టాత్మక ప్రముఖ టాక్ షో లో పాల్గొనబోతున్నాడు. లేట్ నైట్ విత్ సేత్ మేయర్స్ లో రాజమౌళి ఆర్ఆర్ఆర్ సినిమా గురించి మాట్లాడబోతున్నాడు. అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఈ టాక్ షో కు మంచి ఆదరణ ఉంటుంది.హాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ మరియు అంతర్జాతీయ స్థాయి సెలబ్రెటీలను మాత్రమే ఈ టాక్ షో లో ఇప్పటి వరకు ప్రేక్షకులు చూశారు. మొదటి సారి ఒక ఇండియన్ స్టార్ డైరెక్టర్ ను ఆ షో లో ప్రేక్షకులు చూడబోతున్నారు. దీన్ని బట్టి రాజమౌళి అంతర్జాతీయ స్థాయి స్టార్ సెలబ్రెటీ హోదాను దక్కించుకున్నాడు అని చెప్పుకోవచ్చు.రాజమౌళి మరియు ఆర్ఆర్ఆర్ యూనిట్ సభ్యులు ప్రస్తుతం యూఎస్ఏ లో ఉన్న విషయం తెల్సిందే. జనవరి 11న జరిగే గోల్డెన్ గ్లోబ్ వేడుకకు హాజరు అవ్వబోతున్నారు. ఈ సినిమా మరియు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ అవార్డులకు నామినేషన్స్ ను రాజమౌళి టీమ్ దక్కించుకున్న విషయం తెల్సిందే. అందే జక్కన్న ఆ అవార్డుల వేడుకలో పాల్గొనబోతున్నారు. ఆ సందర్భంగానే లేట్ నైట్ విత్ సేత్ మేయర్ టాక్ షో లో జక్కన్న సందడి చేయబోతున్నాడు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com